




VARTHAA SAKSHAMU

RNI.Title Code: APTEL/25/A5153

# వార్త సాక్ష్యం

తెలుగు దిన పత్రిక

Editor : SAGINALA RAVI KUMAR

హైదరాబాద్, విజయవాడ | సంపుటి : 01 | సంచిక : 116 | ఆదివారం 27 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల : 2/-


## బంగారం కొనుగోళ్లు తగ్గించాలని

### భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు



వార్త సాక్ష్యం : అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకునేందుకు ఈ చర్య దోహదప డుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్ తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా - మిగతా2లో

## పాకిస్థాన్ డ్రామా బట్టబయలు..

### సింధు జలాల పై వాస్తవాలు ఇవే!



వార్త సాక్ష్యం :

పాకిస్థాన్‌లో నెలకొన్న తీవ్రమైన నీటి, ఆహార భద్రత సంక్షోభానికి భారతే కారణమంటూ ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ ఆరోపణలు చేస్తున్నారు. సింధు జలాల ఒప్పందం పవిత్రతను ప్రస్తావిస్తూ, దీనివల్ల తమ దేశంలోని 25కోట్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని అంతర్జాతీయ వేదికల పై వాదిస్తున్నారు.

- మిగతా2లో

## కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..



2

● కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణకు రంగం సిద్ధం ● నవంబర్ రెండో వారం నుంచి పనులు ప్రారంభం ● 2027 వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని లక్ష్యం ● అక్టోబర్ 5న సీడబ్ల్యూసీకి డిజైన్లు సమర్పించనున్న అధికారులు ● భద్రత, నాణ్యతలో రాజీ లేదన్న మంత్రి ఉత్తమ్

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు



వార్త సాక్ష్యం: భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వస నీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు. స్వల్ప కాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. - మిగతా2లో

## ‘కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది’




2

● రేవంత్ ‘గాంధీ పరివార్’ పై బీజేపీ ఫైర్ ● రేవంత్ వ్యాఖ్యల పై బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ విమర్శలు ● కాంగ్రెస్ లక్ష్యం గాంధీ కుటుంబాన్ని అధికారంలోకి తేవడమేనని ఆరోపణ ● రేవంత్ వ్యాఖ్యల వీడియోను ‘ఎక్స్’లో పంచుకున్న భండారీ ● ఎమర్జెన్సీ, 1984 అల్లర్ల వంటి అంశాల ప్రస్తావన ● నిలంబూర్‌లో బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకుంటూ రేవంత్ వ్యాఖ్యలు

## హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

జీపీఓను గ్రూప్ ‘ఏ’ నుంచి ‘బీ’కి మార్చడాన్ని వ్యతిరేకించిన హైదరాబాద్ ఎంపీ

ఇది వందేళ్ల చారిత్రక సంస్థ అని, పనిభారం అధికమని లేఖలో వెల్లడి

తెలంగాణలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో ఇక్కడే ఉందని గుర్తు చేసిన అసద్

కేంద్ర మంత్రులు పెమ్మసాని, సింధియా జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి



2

## హిందువులంటే జగన్‌కు గిట్టదు.. అందుకే ఆ విధంగా ప్రచారం



వార్త సాక్ష్యం: వైసీపీ అధినేత జగన్‌కు హిందువులన్నా, హిందూ సంప్రదాయాలన్నా గిట్టదని, అందుకే ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిందంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. - మిగతా2లో

## తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం



వార్త సాక్ష్యం : తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. - మిగతా2లో

VARTHAA SAKSHAMU
RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు

ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థల పై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది.

# కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు..

కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు నవంబర్ రెండో వారంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. హైదరాబాద్‌లో ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన డిజైన్లను అక్టోబర్ 5న కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి సమర్పించనున్నట్లు మంత్రి తెలిపారు. కేంద్రం నుంచి అవసరమైన సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే పనులు మొదలు పెడతామని స్పష్టం చేశారు. 2027 వర్షాకాలం నాటికి ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. బ్యారేజీల భద్రత, నాణ్యత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడబోదని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. జాతీయ డ్యామ్ భద్రతా అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) సహా నిపుణుల కమిటీలు లేవనెత్తిన అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకున్నామని, జాతీయ స్థాయి సాంకేతిక సంస్థల సిఫార్సుల మేరకే పనులు చేపడతామని వెల్లడించారు. ఈ మూడు బ్యారేజీల భద్రతను పటిష్ఠం చేసి, వాటి పూర్తి సామర్థ్యాన్ని పునరుద్ధరించడమే ప్రభుత్వ ప్రధాన ప్రాధాన్యత అని ఆయన ఈ సమావేశంలో నొక్కిచెప్పారు.

# తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఐలమ్మ నిలువెత్తు రూపం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆత్మగౌరవ ప్రతీక చాకలి ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రత్యేక ప్రకటన విడుదల చేస్తూ... తెలంగాణ తెగువకు, ధిక్కార స్వరానికి ఆమె నిలువెత్తు రూపమని కొనియాడారు. నాటి రాచరిక వ్యవస్థను ధైర్యంగా ఎదిరించి, రైతాంగ హక్కుల కోసం పోరాడిన ధీర వనిత అని ప్రశంసించారు. అణచివేతకు గురవుతున్న బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని ఆమె ప్రపంచానికి చాటిచెప్పారని పేర్కొన్నారు. కేవలం భూస్వాములను వ్యతిరేకించడమే కాకుండా, అప్పట్లోనే చట్టాల పరిధిలో కోర్టుల ద్వారా న్యాయం పొంది ఆమె ప్రజాస్వామిక నిబద్ధతను చాటుకున్నారని కేసీఆర్ గుర్తుచేశారు. ఐలమ్మ పోరాట పటిమ నేటి యువతకు ఎప్పుడూ ఆదర్శనీయమని, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో ఆమె స్ఫూర్తి చాలా అవసరమని అభిప్రాయపడ్డారు. తాను చేపట్టిన శాంతియుత మలిదశ తెలంగాణ ఉద్యమంలోనూ ఆమె పోరాట స్ఫూర్తి అంతర్భాగంగా ఉందన్నారు. చాకలి ఐలమ్మ చరిత్రను భావితరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతోనే తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆమె జయంతిని అధికారికంగా నిర్వహించే సంప్రదాయానికి శ్రీకారం చుట్టామని కేసీఆర్ వెల్లడించారు. ఐలమ్మ ఆశయాల సాధనే ధ్యేయంగా తాము అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో మహిళా, శిశు సంక్షేమంతో పాటు రైతాంగం, సబ్బండ కులాల అభ్యున్నతికి ఎన్నో విప్లవాత్మక పథకాలను అమలు చేశామని తెలిపారు. కులవృత్తులకు పునరుజ్జీవం పోసి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా తెలంగాణ ఆత్మగౌరవాన్ని మహోన్నతంగా నిలబెట్టామని, ఆనాడు తాము సాధించిన ప్రగతి నేడు దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని ఆయన పేర్కొన్నారు.

# హిందువులంటే జగన్‌కు గిట్టదు.. అందుకే ఆ విధంగా ప్రచారం

వైసీపీ అధినేత జగన్ కు హిందువులన్నా, హిందూ సంప్రదాయాలన్నా గిట్టదని, అందుకే ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిందంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు పడిందనే నెపంతో, ఒక టీడీపీ నాయకుడిని బెదిరించి, బలవంతంగా విగ్రహాన్ని నీటితో కడిగించి, దాన్ని వీడియో తీసి వైసీపీ నేతలు రాక్షసానందం పొందారని ఆయన మండిపడ్డారు. "హిందువులు శుభకార్యాలకు ప్రతీకగా భావించే పసుపు రంగు అంటే వైసీపీ నాయకులకు ఎందుకంత కోపం? విగ్రహంపై పసుపు పడితే, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గానీ, దారికాచి ఒక వ్యక్తిని బెదిరించి ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణం. ఇది కేవలం ఒక టీడీపీ నాయకుడిపై జరిగిన దాడి కాదు, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా పరిగణించాలి" అని దీపక్ రెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల ఇలాంటి దౌర్జన్యపూరిత ప్రవర్తనను చూసే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఘోరంగా ఓడించారని, అయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. భవిష్యత్తులోనూ ఇదే వైఖరి కొనసాగిస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు.

**వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే అనేక సంఘటనలు జరిగాయని దీపక్ రెడ్డి గుర్తుచేశారు. "శ్రీశైలం నుంచి రామతీర్థం వరకు దాదాపు 300 దేవాలయాలపై దాడులు జరిగాయి. అంతర్వేది రథం దగ్ధం నుంచి రామతీర్థంలో రాముడి విగ్రహ శిరస్సు ఖండన వరకు ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారు. అయినా బాధ్యులైన ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదు. అప్పటి మంత్రి కొడాలి నాని సైతం విగ్రహాల ధ్వంసంపై బాధ్యతారహితంగా మాట్లాడారు" అని దుయ్యబట్టారు. తిరుమల పవిత్రతను సైతం మంటగలిపారని దీపక్ రెడ్డి ఆరోపించారు. బస్సు టికెట్ల వెనుక అన్యమత ప్రచార వాక్యాలు, టీటీడీ వెబ్‌సైట్‌లో అశ్లీల చిత్రాలు, అధిక ధరలతో భక్తులను దేవుడికి దూరం చేసే కుట్ర చేశారని విమర్శించారు. పరకామణిలో జరిగిన దొంగతనాన్ని జగన్ చిన్నదిగా అభివర్ణించడం, వైవీ సుబ్బారెడ్డి భార్య ఆధ్వర్యంలో 'జగన్మోహక రక్షక' అంటూ అన్యమత ప్రార్థనలు చేయించడం వంటి ఘటనలు హిందువుల మనోభావాలను తీవ్రంగా గాయపరిచాయని అన్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా తమ పద్ధతి మార్చుకోవాలని ఆయన హితవు పలికారు.

# పాకిస్థాన్ డ్రామా బట్టబయలు.. సింధు జలాల పై వాస్తవాలు ఇవే!

సింధు జలాల ఒప్పందం పవిత్రతను ప్రస్తావిస్తూ, దీనివల్ల తమ దేశంలోని 25 కోట్ల ప్రజల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని అంతర్జాతీయ వేదికలపై వాదిస్తున్నారు. అయితే, ఇది పూర్తిగా తమ దేశీయ అసమర్థ పాలన, వైఫల్యాల నుంచి దృష్టిని మళ్లించే ప్రయత్నమేనని ఓ కీలక నివేదిక స్పష్టం చేసింది. భారత సింధు జలాల మాజీ కమిషనర్ పీకే సక్సేనా 'నాట్‌స్ట్రాట్'లో రాసిన కథనంలో ఈ విషయాలను లోతుగా విశ్లేషించారు. పాకిస్థాన్ ఎదుర్కొంటున్న నీటి సంక్షోభానికి జమ్మూకశ్మీర్‌లో భారత్ చేపడుతున్న ప్రాజెక్టులు కారణం కాదని, మౌలిక సదుపాయాలు, సంస్థాగత సామర్థ్యం, వనరుల నిర్వహణ కంటే సరిహద్దు ఆవల ఉగ్రవాదానికే ఇస్లామాబాద్ పెద్దపీట వేయడమే అసలు సమస్య అని సక్సేనా పేర్కొన్నారు. "1947లో భారత్‌తో సమాన అవకాశాలతో ప్రయాణం మొదలుపెట్టిన పాకిస్థాన్, 2026 నాటికి అభివృద్ధిని జాతీయ లక్ష్యంగా కాకుండా ఉగ్రవాదాన్ని ఒక ప్రభుత్వ విధానంగా ఎందుకు మార్చుకుంది? ఈ వైరుధ్యమే అంతర్జాతీయ సమాజం పరిశీలించాల్సిన అంశం" అని ఆయన తన నివేదికలో ప్రశ్నించారు.

**80% నీరు పొందుతున్నా.. బాధితుల్లా ప్రచారం**

నదీ ప్రవాహానికి ఎగువన ఉన్న దేశం కారణంగా తాము బాధితులుగా మిగిలిపోయామని పాకిస్థాన్ దౌత్యపరంగా వాదిస్తోందని, కానీ 1960 నాటి సింధు జలాల ఒప్పందం ప్రకారం వాస్తవాలు దీనికి పూర్తి విరుద్ధంగా ఉన్నాయని సక్సేనా తెలిపారు. ఈ ఒప్పందం కింద, సింధు నదీ వ్యవస్థలోని మొత్తం నీటిలో 80 శాతానికి పైగా, అంటే సుమారు 135 మిలియన్ ఎకరపు అడుగుల (ఎంఏఎఫ్) నీటిని పాకిస్థానే పొందుతోంది. భారత్‌కు కేవలం 33 ఎంఏఎఫ్ మాత్రమే కేటాయించారు. ఇంత భారీ నీటి లభ్యత ఉన్న పాకిస్థాన్‌ను ఏ ప్రమాణాల ప్రకారం చూసినా 'నీటి పేద' దేశంగా పరిగణించలేమని ఆయన స్పష్టం చేశారు. అందుబాటులో ఉన్న నీటిని సంరక్షించుకోవడంలో, నిర్వహించుకోవడంలో పాలనాపరమైన వైఫల్యాలే ఆ దేశ వ్యవసాయ సంక్షోభానికి కారణమని ఆయన విశ్లేషించారు.

**భారత్ ప్రాజెక్టులతో నష్టం లేదు**

కిషన్‌గంగ, బగ్లిహార్, రాట్లే వంటి భారత 'రన్-ఆఫ్-ది-రివర్' ప్రాజెక్టుల పై పాకిస్థాన్ తరచూ ఆరోపణలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్టులు నీటిని వినియోగించు కోవని, కేవలం నది సహజ ప్రవాహ శక్తితో విద్యుత్‌ను ఉత్పత్తి చేసి, ఆ నీటిని తిరిగి నదిలోకి వదిలేస్తాయని ఇంజినీరింగ్ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. దీనివల్ల నీటి పరిమాణంలో ఎలాంటి నష్టం జరగదు. ఒప్పందం ప్రకారం పశ్చిమ నదులపై నిర్మించుకోవడానికి అనుమతి ఉన్న నిల్వ సామర్థ్యంలో కూడా భారత్ అతికొద్ది భాగాన్ని మాత్రమే ఉపయోగించుకుందని సక్సేనా గుర్తుచేశారు. పాకిస్థానీ రైతులు ఎదుర్కొంటున్న నీటి కొరతకు అసలు కారణం అక్కడి 'వారాబందీ' పంపిణీ వ్యవస్థేనని ఆయన స్పష్టం చేశారు. ఈ వ్యవస్థ కింద, కాలువల ప్రారంభంలో ఉన్న రాజకీయ పలుకుబడి కలిగిన భూస్వాములకే నీరు అధికంగా అందుతుంది. చివర్లో ఉన్న చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర నీటి కొరత ఏర్పడుతుంది. ఇది పూర్తిగా పాకిస్థాన్ అంతర్గత పంపిణీ సమస్యే తప్ప, దీనికి భారత్‌తో ఎలాంటి సంబంధం లేదని ఆయన తన నివేదికలో పేర్కొన్నారు.

## బంగారం కొనుగోళ్లు తగ్గించాలని భారతీయులకు ప్రధాని మోదీ మరోసారి పిలుపు

అత్యవసరమైతే తప్ప బంగారం కొనుగోళ్లకు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతీయులకు మరోసారి విజ్ఞప్తి చేశారు. దేశ విదేశీ మారక ద్రవ్య (ఫారెక్స్) నిల్వలను కాపాడుకు నేందుకు ఈ చర్య దోహదపడుతుందని ఆయన సూచించారు. త్వరలో రానున్న ధన్‌తేరస్, దీపావళి వంటి కీలక పండగల నేపథ్యంలో ప్రధాని పిలుపునకు ప్రజల నుంచి ఎలాంటి స్పందన వస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇరాన్ యుద్ధం కారణంగా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో, 2026 మే నెలలో మోదీ తొలిసారి ఈ విజ్ఞప్తి చేశారు. తాజాగా సెప్టెంబర్‌లోనూ ఆయన ఇదే విషయాన్ని గుర్తుచేశారు. భారత్ తన అవసరాలకు సంబంధించి అత్యధిక శాతం బంగారాన్ని దిగుమతుల ద్వారానే పొందుతోంది. 2026 రెండో త్రైమాసికంలో దేశీయ సరఫరాలో 82 శాతం దిగుమతుల నుంచే లభించింది. దీనివల్ల డాలర్ల రూపంలో చెల్లింపులు పెరిగి, సుమారు 780 నుంచి 785 బిలియన్ డాలర్లుగా ఉన్న ఫారెక్స్ నిల్వల పై ఒత్తిడి పెరుగుతోంది. ప్రధాని విజ్ఞప్తి ప్రభావం ఇప్పటికే కొంతమేర కనిపిస్తోంది. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో అనవసర కొనుగోళ్లు తగ్గినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది వినాయక చవితి సందర్భంగా బంగారం అమ్మకాల పరిమాణం సుమారు 15 శాతం మేర తగ్గింది. వినియోగదారులు ఎక్కువగా తేలికపాటి ఆభరణాలను ఎంచుకోవడం లేదా పాత బంగారాన్ని మార్చుకోవడం వంటి పద్ధతులకు మొగ్గు చూపుతున్నారు. పండగల సమయంలో బంగారం కొనుగోలు చేయడం అనేది సంప్రదాయం, భావోద్వేగాలతో ముడిపడి ఉంటుందని గ్రోత్‌వైన్ క్యాపిటల్ నిపుణుడు శుభమ్ గుప్తా అభిప్రాయపడ్డారు. ఇప్పటికే తగినంత బంగారం ఉన్నవారు ఈసారి లాంఛనంగా కొద్ది మొత్తంలో కొనుగోలు చేయడం మేలని ఆయన సూచించారు. కేవలం పెట్టుబడి కోసమైతే, భౌతిక బంగారానికి బదులుగా గోల్డ్ ఈటీఎఫ్‌లు లేదా గోల్డ్ మ్యూచువల్ ఫండ్స్ ఉత్తమ ప్రత్యామ్నాయాలని ఆయన వివరించారు. ఏదేమైనా, ప్రధాని పిలుపునకు అసలైన పరీక్ష రాబోయే పండగల సీజన్‌లోనే ఎదురుకానుంది.

## 'కాంగ్రెస్ లక్ష్యమేంటో బయటపడింది'..

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేసిన 'గాంధీ పరివార్-సంఘ్ పరివార్' వ్యాఖ్యలు రాజకీయంగా చర్చకు దారితీశాయి. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రేవంత్ మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు కోసం జరుగుతున్న రాజకీయ పోరు ఈ రెండు పరివార్ల మధ్యేనని అన్నారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ స్పందించారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను భండారీ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో పంచుకున్నారు. రేవంత్ 'గాంధీ పరివార్' కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పిన విషయాన్ని ప్రస్తావించారు.

**'కాంగ్రెస్ లక్ష్యం అదే' అంటూ ఆరోపణ**

రేవంత్ వ్యాఖ్యలు కాంగ్రెస్ రాజకీయ లక్ష్యాన్ని బయటపెట్టాయని భండారీ ఆరోపించారు. కాంగ్రెస్ ప్రధాన ఉద్దేశం గాంధీ కుటుంబాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావడమేనని ఆయన వ్యాఖ్యానించారు. ఎన్నికల సంఘం, రాజ్యాంగం, ప్రజాస్వామ్యం వంటి అంశాల కంటే కుటుంబ రాజకీయాలకే కాంగ్రెస్ ప్రాధాన్యం ఇస్తోందని విమర్శించారు. గాంధీ-వాద్రా కుటుంబ పాలన అంటూ విమర్శలు గుప్పించిన భండారీ పలు చారిత్రక, రాజకీయ అంశాలను ప్రస్తావించారు. ఎమర్జెన్సీ, 1984 సిక్కు వ్యతిరేక అల్లర్లు, 26/11 ముంబయి ఉగ్రదాడుల సమయంలో భారత స్పందన వంటి అంశాలను ఆయన గుర్తుచేశారు. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం, దేశ ఆర్థిక పరిస్థితి, పేదరికం వంటి అంశాలపైనా వ్యాఖ్యలు చేశారు.

**అసలు రేవంత్ ఏం అన్నారు?**

నిలంబూర్‌లో ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు అందుకున్న సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడారు. దేశ భవిష్యత్తు కోసం 'గాంధీ పరివార్', 'సంఘ్ పరివార్' మధ్య పోరు జరుగుతోందని అన్నారు. గాంధీ కుటుంబానికి చెందిన పలువురు దేశం కోసం త్యాగాలు చేశారని పేర్కొన్నారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడటమే తనకు మిగిలిన రాజకీయ లక్ష్యమని కూడా చెప్పారు.

## హైదరాబాద్ జీపీఓ స్థాయిని తగ్గించొద్దు.. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసానికి ఒవైసీ లేఖ

హైదరాబాద్ నగరానికి చారిత్రక వారసత్వంగా ఉన్న హైదరాబాద్ జనరల్ పోస్టాఫీస్ (జీపీఓ) హోదాను తగ్గించాలన్న ప్రతిపాదనను తాము వ్యతిరేకిస్తున్నట్టు ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ తెలిపారు. ఈ ప్రతిపాదనను తక్షణమే విరమించుకోవాలని కోరుతూ కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలకు ఆయన శనివారం లేఖ రాశారు. హైదరాబాద్ జీపీఓను గ్రూప్ 'ఏ' నుంచి గ్రూప్ 'బీ'కి మార్చడంతో పాటు, హైదరాబాద్ సిటీ డివిజన్‌లో విలీనం చేయాలని ఇటీవల వచ్చిన ప్రతిపాదన సరికాదంటూ ఒవైసీ తన లేఖలో ప్రస్తావించారు. వందేళ్లకు పైగా చరిత్ర ఉన్న ఈ సంస్థ హోదాను తగ్గించడం అన్యాయమని, ఏకపక్ష నిర్ణయమని ఆయన అభిప్రాయ పడ్డారు. జీపీఓ ఉద్యోగుల నుంచి తనకు అందిన వినతిపత్రాన్ని కూడా ఈ లేఖకు జతపరిచినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జీపీఓ ప్రాముఖ్యతను ఒవైసీ వివరించారు. "హైదరాబాద్ జీపీఓ అత్యధిక పనిభారం కలిగిన ముఖ్యమైన సంస్థ. హైదరాబాద్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలోని మొత్తం మెయిల్ కార్యకలాపాల్లో జీపీఓ వాటా గణనీయంగా ఉంది. దీని డెలివరీ పరిధి కూడా నిరంతరం విస్తరిస్తోంది. అంతేకాకుండా, తెలంగాణ రాష్ట్రంలో ఏకైక ఫిలాటెలిక్ బ్యూరో (తపాలా స్టాంపుల సేకరణ, పోస్టల్ చరిత్ర పరిశోధన) ఇక్కడే ఉంది" అని ఆయన పేర్కొన్నారు. ప్రజల ప్రయోజనాలను, సంస్థ వారసత్వ గుర్తింపును దృష్టిలో ఉంచుకుని, కేంద్ర మంత్రులు ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సంపాదకీయం

## నీళ్ల కోసం పాలమూరు పోరుబాట



ఉమ్మడి పాలమూరు జిల్లాలో నీటి వాటా సమస్య చాలా కాలంగా చర్చలో ఉన్నా, గత రెండు మూడు మాసాలుగా మరింతగా ఊపందుకుంది. ముఖ్యమంత్రితో సహా చాలామంది మంత్రులు ఈ సమస్య గురించి మాట్లాడుతున్నారు. బహుశా మొదటిసారి జిల్లాకు సంబంధించిన అందరు ఎమ్మెల్యేలు, మంత్రులతో సహా ముఖ్యమంత్రిని కలిసి తమ జిల్లా నీటి సమస్య గురించి మాట్లాడారు. ప్రభుత్వ యంత్రాంగం కొంత కదిలింది. ఈ సమస్యకు ప్రాధాన్యం ఉంటుందని, పరిష్కారం వస్తుందని మాట్లాడుతున్నారు. అయితే ప్రజలెవ్వరూ ఈ మాటలను పూర్తిగా విశ్వసించడం లేదు. దానికి కారణం గతంలో కూడా ఇలాంటి వాగ్దానాలు చేసినా సమస్య పరిష్కారం దిశగా సాగలేదు. తెలంగాణలో మూడు ఉద్యమాలు పురుడు పోసుకున్నాయి. ఈ ఉద్యమాలన్నింటిలో నీళ్ల పంపిణీ ఒక సమస్యగా ముందుకు వచ్చింది. జయశంకర్ రూపొందించిన "నీళ్లు, నిధులు, నియామకాలు" తెలంగాణ ఉద్యమానికి ఒక స్థాయిలో దాని దిశను కల్పించింది. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు నీళ్ల సమస్యను ప్రత్యేకంగా ప్రస్తావించారు. చర్చ ఎక్కడ జరిగినా, తెలంగాణ వెనుకబాటుతనాన్ని గురించి మాట్లాడినప్పుడల్లా కరువులు, వలసలు, ఆత్మహత్యలు ప్రచారంలో భాగమవ్వడమే కాక 'రాష్ట్ర విభజన ఎందుకు?' అన్న ప్రశ్నకు పాలమూరు వెనుకబాటుతనం ఒక బలమైన ఆయుధంగా ఉద్యమం వాడుకున్నది. పాలమూరు జిల్లాకు నీళ్లలో న్యాయమైన వాటా రాలేదని రాజశేఖర రెడ్డిని వ్యక్తిగతంగా కలిసి అడగగా.. 'కృష్ణానది నీళ్ల వాటా ముగిసిన అంశం. ఆ సమస్యను మళ్లీ లేవదీయడం అనవసరం' అని ఆయన కచ్చితంగా చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలోనే న్యాయం కోసం పోరాడవచ్చు అని అంతకాలం అనుకున్న మేము ఆ మాటలు విన్నాక... తెలంగాణ విడిపోవడం తప్ప వేరే మార్గం లేదనే నిర్ణయానికి వచ్చాం. అదే మాట ఆయనతో చెబితే 'ఉద్యమంలో పాల్గొనండి. మిమ్మల్ని ఎవరు ఆపారు' అన్నారు. గతంలో వలే కాకుండా ఈసారి తెలంగాణ ఉద్యమం రాజీలేని పోరాటం చేసింది. సకల జనులంతా ఆ ఉద్యమంలో పాల్గొన్నారు. తెలంగాణకు ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాన్ని గురించి పెద్ద ఎత్తున లేవదీశారు. సభలలో వేలాదిమంది పాల్గొన్నారు. గ్రామగ్రామానికీ ఉద్యమం పాకింది. ఏ జిల్లాలో సభలు జరిగినా పాలమూరు, ఆదిలాబాదు వెనుకబాటుతనం చర్చకు వచ్చింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు సూత్ర రీత్యా కిరణ్ కుమార్‌రెడ్డి ప్రభుత్వం ఒక జీవో కూడా తెచ్చింది. సర్వే ప్రారంభమయ్యింది. పాలమూరు ప్రజల్లో ఒక ఆశ చిగురించింది. ఈ జీవో ఉద్యమానికి దోహదపడింది. నీటిరంగంలో నిష్ణాతులు విద్యాసాగరరావు నీళ్ల గురించి మొత్తం తెలంగాణను అడ్వకేటు చేశారు. పాలమూరు నీళ్ల గురించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడేవారు. తీరా తెలంగాణ వచ్చాక సార్‌ను సలహాదారుగా నియమించారు. నిజానికి ఆయనను ఇరిగేషన్ మంత్రిగా నియమించాల్సింది. ఒక సందర్భంలో పాలమూరు జిల్లా నీటి సమస్య గురించి మాట్లాడితే తన సలహాలను ప్రభుత్వం ఎక్కువగా పట్టించుకోవడం లేదని బాధపడ్డారు. రాష్ట్రం ఏర్పడక ముందే జయ శంకర్ మరణించడం వల్ల తెలంగాణకు, ముఖ్యంగా పాలమూరు జిల్లాకు చాలా అన్యాయం జరిగింది. తెలంగాణ ప్రభుత్వం పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును ప్రారంభించింది. కానీ మధ్యంతరంగా దానిని ఆపి, కాళేశ్వరం ప్రాజెక్టును ప్రథమ ప్రాధాన్యంగా స్వీకరించింది. ఒక వెనుకబడిన ప్రాంతం పోరాటం చేసి, ప్రాణత్యాగాలు చేసి తెలంగాణ సాధించుకున్నప్పుడు, అదే ప్రమాణం మీద... వెనుకబడిన ప్రాంతంలోని మరీ వెనుకబడిన జిల్లాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అదే నిజమైన న్యాయసూత్రం. తెలంగాణలో ఏ జిల్లా బాగుపడ్డా తెలంగాణ అభివృద్ధి చెందినట్లే అని భావించేవారు చాలామందే ఉన్నారు. బాధపడుతున్న వారికి తెలిసినంతగా ఈ సమస్య ఇతరులకు అర్థం కాకపోవచ్చు. పాలమూరు వలసల జీవితాలను, వాళ్లు అనుభవించిన వేదనను సానుభూతితో లేదా న్యాయ దృక్పథంతో చూస్తే తప్ప అర్థం కాదు. ఏ జిల్లాకు నీళ్లు వస్తే ఏమిటి? అన్న ప్రశ్న దశాబ్దాల కాలం పోరాటం చేస్తున్న ప్రజల కష్టాలకు జవాబు కాదు. ఆశ్చర్యంగా... జిల్లాకు అన్యాయం జరిగిందంటే, పాలమూరులో ప్రవహించే నీళ్లను డిండికి తరలించి, ఈ జిల్లా కంటే అభివృద్ధి చెందిన నల్లగొండకు నీటిని తీసుకుపోవడమేమిటి? తెలంగాణ సాధించి దశాబ్దకాలం దాటినా, జిల్లాను పట్టించుకోకపోవడం వల్ల పాలమూరు అధ్యయన వేదిక తన శక్తి సరిపోదని జిల్లాలోని ఇతర ప్రముఖులను కలుపుకుని ఒక జేఏసీని ఏర్పాటుచేసి ఉద్యమాన్ని ముందుకు తీసుకుపోతున్నది. తెలంగాణ ప్రత్యేకరాష్ట్ర ఉద్యమం ద్వారా తెలంగాణ ప్రజలు చాలా పాఠాలు నేర్చుకున్నారు. చర్చల ద్వారా, కమిషన్‌ల ద్వారా సమస్యలపై అవగాహన పెరగవచ్చు కానీ, ప్రజల ఒత్తిడి లేకుండా ప్రజల సమస్యల పరిష్కారం చేసి దూరదృష్టి కలిగిన న్యాయ భావన కలిగిన నాయకత్వం లేకపోతే ఉద్యమాలే చివరికి మిగులుతాయన్నది పెద్ద పాఠం. అత్యంత వెనుకబడిన జిల్లాల ప్రజలు ఉద్యమించకపోతే అభివృద్ధి చెందిన వర్గాలు, ప్రాంతాల వారు రాజకీయ నిర్ణయాలలో కీలక పాత్ర నిర్వహిస్తారు.

# శ్రీశైలంలో శ్రీ స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ





**శ్రీశైల దేవస్థానం సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

శ్రీశైలంలో ఈ రోజు పౌర్ణమి సందర్భంగా దేవస్థానం శ్రీశైల గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించనున్నది. ఈ రోజు సాయంత్రం శ్రీస్వామి అమ్మ వార్ల మహా మంగళహారతుల అనంతరం ఈ గిరిప్రదక్షిణ ప్రారంభవుతుంది. ఆలయ మహాద్వారం నుండి మొదలైన ఈ ప్రదక్షిణ గంగాధర మండపం, అంకాళమ్మ ఆలయం, నందిమండపం, బయలు వీరభద్ర స్వామి ఆలయం నుండి అలంకారేశ్వర ఆలయం మీదుగా వలయ రహదారిపైకి చేరుకుంటుంది. అక్కడి నుండి సారంగధర మఠం మీదుగా సాగి హేమారెడ్డి మల్లమ్మ మందిరం వద్దకు చేరుకుంటుంది. హేమారెడ్డి మల్లమ్మ మందిరం నుంచి మహిషాసురమర్ధిని, రుద్రాక్షమఠం, విభూతిమఠాల మీదుగా రుద్రవనంలోకి చేరుకుంటుంది. రుద్రవనం నుంచి నందిమండపం వద్దకు రావడంతో ఈ గిరి ప్రదక్షిణ ముగుస్తుంది. శ్రీశైలక్షేత్రములోని ప్రాచీనమఠాలను, ఆలయాలను భక్తులచేత దర్శింపజేయిస్తూ వారిలో భక్తిభావాలను మరింతగా పెంపొందింపజేయాలని, అదేవిధంగా క్షేత్రాన్ని ఆధ్యాత్మికంగా తీర్చిదిద్దడంలో భాగంగా ఈ గిరిప్రదక్షిణను నిర్వహించడం జరుగుతోంది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులందరికీ ప్రదక్షిణానంతరం శ్రీస్వామివార్ల దర్శనం కల్పించబడుతోంది.

# కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పౌర్ణమి వేడుకలు

**వార్త సాక్ష్యం సెప్టెంబర్ 26- వెలుగోడు :**

వెలుగోడు మండలంలోని గుంతకందాల గ్రామ సమీపములో టర్నింగ్ వద్ద కాశిరెడ్డి నాయన ఆశ్రమంలో పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆశ్రమానికి చేరుకుని కాశిరెడ్డి నాయన విగ్రహానికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, నామ సంకీర్తనలతో ఆశ్రమ ప్రాంగణం భక్తిమయంగా మారింది. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ఇక్కడ పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని, ఈ పౌర్ణమి పూజలకు వెలుగోడు,గుంతకందాల పరిసర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారని ఆశ్రమ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులు, యువకులు పాల్గొన్నారు.



# సింగరేణి ప్రధాన కార్యాలయము నందు వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు






**వార్త సాక్షం సెప్టెంబర్ 26**

సింగరేణి ప్రధాన కార్యాలయం లోని హెచ్‌ఆర్‌డి కాన్ఫరెన్స్ హాల్ శనివారం న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను నిర్వహించడం జరిగింది. జీఎం(పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ – సెక్యూరిటీ కే.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిదిగా సంస్థ డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ హాజరయ్యారు. ముందుగా చాకలి ఐలమ్మ చిత్ర పటానికి ముఖ్య అతిది డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ తో పాటు యూనియన్ నాయకులు, శాఖాధిపతులు, అధికారులు ఉద్యోగులు ఆయనకు ఘనంగా పూల మాలతో పూలతో నివాళులు అర్పించారు. అనం తరం ఈ సంధర్భముగా డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తెలంగాణ రైతాంగ ఉద్యమంలో ధైర్యసాహసాలతో పోరాడిన వీరనారి, తెలంగాణ సాయుధ పోరాటయోధురాలు ఆత్మగౌర వానికి ప్రతీక అయిన శ్రీమతి చాకలి ఐలమ్మ జయంతి ఉత్సవాలను ఇక్కడ ఇంత ఘనముగా జరుపుకోవటం చాలా సంతోషముగా ఉందని, కార్పొరేట్ లో మాత్రమే కాకుండా సింగరేణి వ్యాప్తముగా కూడా ఈ జన్మదిన వేడుకలను జరుపుకుంటున్నామని తెలిపారు. చాకలి ఐలమ్మ అణచివేత, భూస్వామ్య దోపిడీకి, వెట్టి చాకిరీకి వ్యతిరేకంగా భూమి, భుక్తి, హక్కులకోసం ధైర్యంగా నిలిచి, పేదలు, రైతులు, మహిళలకు స్ఫూర్తిగా నిలిచిన ఐలమ్మ జీవితం చిరస్మరణీయం అని తెలిపారు. శ్రీమతి చాకలి ఐలమ్మ జయంతి వేడుకల ద్వారా ఆమె ధైర్య సాహసాలను, చేసిన సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజం లో జరిగే అన్యాయాలను ఎదురించి నిలబడాలని తెలిపారు. జీఎం (పర్సనల్) వెల్ఫేర్, సిఎస్ఆర్ – సెక్యూరిటీ కే.అజ య్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి డైరక్టర్ (ఆపరేషన్స్) ఎల్.వి.సూర్యనారాయణ తో పాటు జనరల్ మేనేజర్ (సిపిడిపి) ఏ.మనోహర్, ఏఐట్టియూసి నాయకులు ఎస్.రాము, ఐఎన్‌టియూసి నాయకులు ఎస్.పితాంబర రావు, సిఎంఓఏఐ ఉపాధ్యక్షుడు కేశవ రావు, జీఎం(సిహెచ్‌పి) పి.ఎలి షా, జీఎం(పర్సనల్) ఐఆర్ – పిఎం జి.వి.కిరణ్ కుమార్, జీఎం(పర్సనల్) ఈఈ – ఆర్‌సి ఏజే ఎం మురళీధర రావు, జీఎం (ఈడఎం) వర్క్ షాప్ –ఎనర్జీ మేనేజ్‌మెంట్) కె. శ్రీనివాసులు, జీఎం (బిడి) బి.రామదాసు, డిజిఎం(పర్సనల్) లు బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కార్పోరేట్ లోని వివిధ విభాగాల జనరల్ మేనేజర్లు, అధికా రులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# మహిళ స్ఫూర్తిదాయని చాకలి ఐలమ్మ

**ముధోల్:26సెప్టెంబర్ వార్త సాక్షం**



మహిళ స్ఫూర్తిదాయని చాకలి ఐలమ్మ అని ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త ఆకుల దినేష్ అన్నారు. శనివారం నియోజకవర్గ కేంద్రమైన ముధోల్ వ్యవసాయ పరిశోధన స్థానంలో చాకలి ఐలమ్మ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చాకలి ఐలమ్మ తెలంగాణ ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం ధైర్యంగా పోరాడిందన్నారు. నేటి తరం ఆమెను ఆదర్శంగా తీసుకొని ఐలమ్మ ఆశయాలను కొనసాగించాలన్నారు. భూమి భుక్తి, విముక్తి ఆత్మగౌరవం కోసం పీడిత వర్గాలను ఐక్యం చేసి పోరాట బాట పట్టించిన ఘనత ఆమెకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ వికే నిర్మల్ హెడ్ శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ, పరిశోధన స్థానం సిబ్బంది పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU
వార్త సాక్షం
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

# ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలి







**-నీటి సరఫరా, విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి**

**-పాఠశాలల్లో హాజరు శాతం పెంచేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలి**

**-ఏఐ (ఏ 1) ల్యాబ్స్ ద్వారా విద్యార్థులకు అధునాతన బోధన**

**-కాల్వ శ్రీరాంపూర్ మండల సర్వసభ్య సమావేశంలో వివిధ శాఖల పనితీరును సమీక్షించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 26 వార్త సాక్షం

ప్రజలకు మెరుగైన సేవలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం కాల్వ శ్రీరాంపూర్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొని వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. విద్య, తాగునీటి సరఫరా,పారిశుధ్యం మహిళా శిశు సంక్షేమం, ఎలక్ట్రిసిటీ, వ్యవసాయం, తదితర కీలక అంశాలపై అధికారులకు పలు సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ,,అభివృద్ధి పనులు, మౌలిక వసతులు,నీటి సరఫరా, ఎలక్ట్రిసిటీ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని, 'విబిజీ రాంజీ' పథకం కింద పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు. మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో విద్యార్థులు రెగ్యులర్‌గా హాజరు కావడం లేదని, విద్యార్థులు సరిగా హాజరు కాకపోవడం వల్ల ఉపాధ్యాయులకు బోధనలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు సహాయంతో అడ్మిషన్ల సంఖ్య పెంచేలా చొరవ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమస్య పరిష్కారానికి పేరెంట్స్-టీచర్స్ మీటింగ్‌లు నిర్వహించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల ఉపాధ్యాయుల హాజరును పకడ్బందీగా పర్యవేక్షించాలని తెలిపారు. విద్యార్థులు సౌలభ్యం కోసం ప్రత్యేక నిధులతో తరగతి గదులు, కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ ఏర్పాటు చేస్తున్నట్లు, చాలా పాఠశాలల్లో అధునాతన ఏఐ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేశామని, సాధారణంగా ఆరు నెలల్లో నేర్చుకునే విషయాలను ఈ ల్యాబ్స్ ద్వారా కేవలం 45 రోజుల్లోనే నేర్చుకోవచ్చని, ఉపాధ్యాయుల ద్వారా ఈ ల్యాబ్స్‌లో అధునాతన బోధన అందిస్తున్నామన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుడప్పుడు పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడాలని, ఏఐ ల్యాబ్స్‌ను పరిశీలించాలని కోరారు. దీనివల్ల ఉపాధ్యాయులు అందిస్తున్న బోధనా విధానం తల్లిదండ్రులకు అర్థమవుతుందని అన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సపోర్టివ్‌గా ఉంటే, వారు మరింత ఉత్సాహంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తారని పేర్కొన్నారు.

**అంగన్వాడీ కేంద్రాలు - పోషకాహారం:**

అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం సక్రమంగా అందేలా పర్యవేక్షించాలని, ఆరోగ్యలక్ష్మి పథకం సేవలు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని పురాతన ఆరోగ్య కేంద్ర భవనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు ప్రామిక ఆరోగ్య కేంద్రం లోని సౌకర్యాల వైద్య సేవల గురించి పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల స్పెషల్ ఆఫీసర్ శ్రీమాల, ఎంపీడీవో సురేందర్ కుమార్, తహసీల్దార్ రాముడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తిరుపతిరెడ్డి, మండల సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# కాళ్లకల్ శివారులో అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్ గోదాంపై సంయుక్త దాడులు

**-296 గ్యాస్ సిలిండర్లు స్వాధీనం**

**-నిత్యానందం,జిల్లా సివిల్ సప్లై అధికారి**

మెదక్ జిల్లాప్రతినిది వార్త సాక్షం సెప్టెంబర్ 26



జిల్లా సివిల్ సప్లై అధికారి ఆదేశాల మేరకు, మెదక్ జిల్లా కాళ్లకల్ గ్రామ శివారులోని ఒక గోదాంలో అక్రమంగా గ్యాస్ సిలిండర్లను రీఫిల్లింగ్ చేస్తున్నట్లు అందిన సమాచారంతో సివిల్ సప్లై ఇన్‌స్పెక్టర్ నర్సిములు మరియు మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ సుభాష్ గౌడ్ ఆధ్వర్యంలో సివిల్ సప్లై సిబ్బంది, పోలీసు సిబ్బంది సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గోదాంలో అక్రమంగా నిల్వ ఉంచిన మొత్తం 296 గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. అనధికారికంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేయడం, సిలిండర్లను అక్రమంగా నిల్వ చేయడం వల్ల అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉండటంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు తీవ్ర ముప్పు ఏర్పడే అవకాశం ఉందని జిల్లా సివిల్ సప్లై అధికారి తెలిపారు. ఇలాంటి అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్, సిలిండర్ల అక్రమ నిల్వ లేదా విక్రయాలకు పాల్పడే వారిపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని, క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లై అధికారి హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా ఇలాంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు గుర్తించినా లేదా సమాచారం అందినా వెంటనే చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రజల భద్రతకు ముప్పు కలిగించే ఇలాంటి అక్రమ కార్యకలాపాలు తమ దృష్టికి వస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని జిల్లా సివిల్ సప్లై అధికారి కోరారు.

# మెదక్ టూరిజం అభివృద్ధిలో కలెక్టర్ ప్రతిమాసింగ్ దక్కిన అరుదైన గౌరవం

**-"మెదక్ టూరిజం అభివృద్ధికి విశేష కృషి చేసిన మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ను అభినందించిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క"**

మెదక్ జిల్లాప్రతినిది వార్త సాక్షం సెప్టెంబర్ 26



హైదరాబాద్ శిల్పారామం లో ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రతిష్టాత్మక అవార్డు. కలెక్టర్‌కు అభినందనలు తెలిపిన ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, జిల్లా అధికారులు ప్రపంచ పర్యాటక దినోత్సవం (వరల్డ్ టూరిజం డే) పురస్కరించుకుని హైదరాబాద్ శిల్పారామం లోని రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్‌కు ప్రతిష్టాత్మక "ఉత్తమ పర్యాటక ప్రతిభ అవార్డు" లభించింది. రాష్ట్ర రాజధానిలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గారు ముఖ్య అతిథిగా విచ్చేసి, జిల్లా కలెక్టర్‌కు ఈ అవార్డును అందజేసి ఘనంగా సత్కరించారు. జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి, చారిత్రక కట్టడాల సంరక్షణకు, పర్యాటకులకు కల్పించిన మెరుగైన వసతుల విషయంలో జిల్లా యంత్రాంగం చూపిన అద్భుత ప్రతిభకు గానూ ఈ పురస్కారం దక్కింది.

**ఈ సందర్భంగా గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు మాట్లాడుతూ:**

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలను గుర్తించి, వాటిని పర్యాటక హబ్‌లుగా తీర్చిదిద్దడంలో జిల్లా మెదక్ కలెక్టర్ తీసుకున్న చొరవను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే రోజుల్లో మరిన్ని వినూత్న కార్యక్రమాలతో పర్యాటక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

**అవార్డు గ్రహీత, జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..**

ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకోవడం పట్ల కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. గౌరవ ఉప ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ అవార్డు రావడం వెనుక జిల్లా పర్యాటక శాఖ అధికారులు, సిబ్బంది మీడియా,ప్రజల సహకారం ఎంతో ఉందన్నారు. ఈ పురస్కారం తమపై బాధ్యతను మరింత పెంచిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి గారితో పాటు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, పర్యాటక రంగ ప్రముఖులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల సమస్యల పై పౌరసరపర మంత్రి కి వినతి





**-సానుకూలంగా స్పందించిన పౌర సరపర మంత్రి ఉత్తమ్**

**-ఇధి విజయం కాదు కష్టాలను చెప్పుకున్నాం**

**-రాష్ట్ర రైస్ మిల్లర్ల అధ్యక్షుడు గణపతి, ప్రధాన కార్యదర్శి వుట్కూరి వీరేశము**

మెదక్ జిల్లా ప్రతినిధి వార్త సాక్షం 26 సెప్టెంబర్

రైస్ మిల్లర్ల సమస్యల పై పౌరసరపర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి రైస్ మిల్లర్ల సమస్యల పై వినతి పత్రం అందచేసినట్టు వినతి రాష్ట్ర రైస్ మిల్లర్ల అధ్యక్షుడు గణపతి, ప్రధాన కార్యదర్శి వుట్కూరి వీరేశము తెలిపారు. అనంతరశీ వారు మాట్లాడుతు.. పౌరసరపర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తమ సమస్యలపై సానుకులంగా స్పందిస్తు రైసుమిల్లర్లు అయిన ప్రభుత్వం అయిన రైతులకు శ్రేయస్సు కోరే వాల్లమని ప్రభుత్వం తరపున తీర్చగలిగే సమస్యలపై తాము ముఖ్యమంత్రి మరి ఇతర మంత్రివర్గం మంత్రులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారన్నారు. ప్రదాన కార్యదర్శి వుట్కూరి వీరేశం తెలుపుతు తాము తమ పరిశ్రమ ఎప్పుడు ప్రభుత్వానికి రైతులు ఎప్పుడు వ్యతిరేకం కాదు అని తాము ఎదుర్కుంటున్న బాదలు పడుతున్న కష్ట నష్టాల పై మంత్రిని కలిసినట్టు వివరించారు. తాము ప్రభుత్వం మీద నమ్మకం తో సమ్మే విరమిస్తున్నాట్టు ప్రకటిస్తు మంత్రిని మరొక్కసారి కలిసి కృతజ్ఞతలు తెలిపా రు. ఈ కార్యక్రమం లో రైస్ మిల్లర్ల గౌరవ అధ్యక్షుడు సయ్యద్ రఫీ,మరుమళ్ల అశోక్ తదితరులున్నారు.

# కేర్చుపల్లిలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్

**-చీఫ్ గెస్ట్ గా కళ్లెం కృష్ణారెడ్డి**



వార్త సాక్షం సెప్టెంబర్ 26:

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం కేర్చుపల్లి గ్రామపంచాయతీ వద్ద లయన్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మద్దెల మంజుల నిర్వహణలో, ముఖ్య అతిథి కళ్లెం కృష్ణారెడ్డి సమక్షంలో ఈ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వివిధ రకాల వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షల అనంతరం అవసరమైన వారికి మెడిసిన్ టాబ్లెట్లు అందజేశారు. ఈ సందర్భంగా కళ్లెం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజానికి మంచి చేయాలనే ఆలోచనతో సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి సేవ చేయాలని భావించినట్లు తెలిపారు. తల్లిదండ్రుల రుణాన్ని పూర్తిగా తీర్చుకోలేమని, సేవా కార్యక్రమాల ద్వారా సమాజానికి కొంతైనా మేలు చేయాలనే ఉద్దేశంతో లయన్స్ ఇంటర్నేషనల్ టీం సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. క్యాంప్‌కు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను వినియోగించుకోవడం ఆనందంగా ఉందని కృష్ణారెడ్డి పేర్కొన్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ మద్దెల మంజులను శాలువాతో సన్మానించగా, గ్రామపంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో కళ్లెం కృష్ణారెడ్డి బృందం సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ సర్పంచ్ కుంభం వెంకట పాపిరెడ్డి, కేర్చుపల్లి గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామ పెద్దలు, లయన్స్ ఇంటర్నేషనల్ సభ్యులు, వైద్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



వార్త సాక్షం సెప్టెంబర్, 26

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టి, జేఏసీ, ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి, ఈ సందర్భంగా విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. జిల్లా కోఆర్డినేటర్ కొత్తూరి రవిందర్ జిల్లా కో కన్వీనర్ జోగుల సమ్మయ్య మాట్లాడుతూ ఈ తెలంగాణ రాష్ట్రంలో చాకలి ఐలమ్మ ఆశయాలను బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ మాత్రమే కొనసాగిస్తుంది అన్నారు. ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయం రాజ్యాధికార సాధనకై ఈనెల 27 ఆదివారం రోజున ఉమ్మడి వరంగల్ జిల్లాలో హనుమకొండ హంటర్ రోడ్ డి కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్న ఎవరి కులం ఎంతో వారికి అంత వాటా బహిరంగ పంచాయతీ సభను విజయవంతం చేయాలని ఈ సభకు బీసీ ఎస్సీ ఎస్టీ ప్రజలంతా ఐకమత్యంతోని అధిక సంఖ్యలో పాల్గొని తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్నటువంటి ఈ పోరాటం భారతదేశనికే గర్వకారణంగా నిలిచే విధంగా స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ తరలి రావాలని తెలియజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు జిల్లా కో కన్వీనర్ శీలపాక హరీష్, వైనాల శోభన్, మరియు కడపాక రవి,బండారి దశరథం బోయిని ప్రసాద్ మంద ప్రవీణ్,మేకల ఓంకార్, జీడి రాజకొమ్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ ల భారీ బైక్ ర్యాలీ.. సిరిసిల్ల సింహగర్జనకు తరలింపు



ఇల్లంతకుంట సెప్టెంబర్ 26 వార్త సాక్షం

ముదిరాజ్ ల ఐక్యతను చాటుతూ మండల కేంద్రంలో శనివారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ముదిరాజ్ లను బీసీ-డి నుంచి బీసీ-ఏలోకి చేర్చాలని డిమాండ్ చేస్తూ ఈ ర్యాలీ చేపట్టామని వారు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి యువకులు, నాయకులు పెద్ద సంఖ్యలో జెండాలు, నినాదాలతో బైకు లపై కదిలారు. మండల కేంద్రం నుంచి దాదాపు 3 వేల మంది రాజన్న సిరిసిల్లలో జరిగే సింహగర్జన సభకు తరలి వెళ్లామని వారు తెలిపారు,

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A9153
వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR
ఆదివారం 27 సెప్టెంబర్ 2026

# పైతర నర్సింలు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన ఏడుపాయల శ్రీనివాస్ గౌడ్

**-రూ. 5 వేల ఆర్థిక సాయం**



**పాపన్నపేట, సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

కష్టాల్లో ఉన్న కుటుంబాలకు అండగా నిలుస్తూ మానవత్వాన్ని చాటుకుంటున్న సీనియర్ నాయకులు ఏడుపాయల శ్రీనివాస్ గౌడ్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకున్నారు. పాపన్నపేట మండలం నాగసానిపల్లి గ్రామానికి చెందిన పైతర నర్సింలు మృతి చెందిన విషయం తెలుసుకున్న శ్రీనివాస్ గౌడ్ వెంటనే స్పందించారు. మృతుడి కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన శ్రీనివాస్ గౌడ్, వారి కష్ట కాలంలో అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం బాధిత కుటుంబానికి తన వంతు సహాయంగా రూ. 5000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆపదలో ఉన్న కుటుంబాలను ఆదుకోవడం తన బాధ్యతగా భావిస్తూ శ్రీనివాస్ గౌడ్ అందిస్తున్న సహాయాన్ని పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో సామెల్, చంద్రం గౌడ్, దావిద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దపల్లి పట్టణ బిజెపి ఆధ్వర్యంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు



**పెద్దపల్లి, ప్రతినిధి సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాయకులు, కార్యకర్తల సమక్షంలో కేక్ కట్ చేసి జయంతి వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు.?బిజెపి పెద్దపల్లి పట్టణ అధ్యక్షులు పెంజర్ల రాకేష్ మాట్లాడుతూ."భూమి కోసం, భుక్తి కోసం, నిజాం అరాచకాలు మరియు భూస్వాముల వెట్టిచాకిరీకి వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసిన ధీరవనిత చాకలి ఐలమ్మ. భూస్వామి విస్నూర్ దేశ్‌ముఖ్‌ను ఢీకొని, తన కౌలు భూమిలో పండించిన ధాన్యాన్ని కాపాడుకుని తెలంగాణ నారీమణుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టిన ఘనత ఆమెది. ఆమె చూపించిన తెగువ, పోరాట పటిమ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బడుగు బలహీన వర్గాల హక్కుల పరిరక్షణకు బిజెపి ఎల్లప్పుడూ ముందుంటుంది" అని పేర్కొన్నారు.?ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షులు,మున్సిపల్ కౌన్సిలర్ పెంజర్ల రాకేష్ పెద్దపల్లి మండల అధ్యక్షులు వేల్పుల రమేష్ సీనియర్ నాయకులు ఎర్రోల్ల శ్రీకాంత్ ఉప్పు కిరణ్ పట్టణ ప్రధాన కార్యదర్శి గుడ్ల సతీష్ ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కుమార్, కోశాధికారి గాదాసి సతీష్,పోగుల రాజు, బొడ్డుపల్లి అంజి, బొడ్డుపల్లి సంపత్, బొడ్డుపల్లి నవీన్, శివ సాయి, మధుకర్, కుక్క అంజి కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు

# మృతి చెందిన బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



**కల్వకుర్తి ప్రతినిధి సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని ఐదో వార్డుకు చెందిన ఈదమ్మ మృతి చెందడం తో ప్రముఖ సంఘ సేవకులు ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు పాపిశెట్టి రామన్న ఆమె పార్థిహ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేశారు అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి పగడ సంభూతి తెలిపారు ఈ కార్యక్రమంలో రామన్న మిత్ర మండలి సభ్యులు శీను నాయక్ చింటూ శివ చిన్న జంగయ్య వెంకటయ్య యాదయ్య రమేష్ మహేష్ సాయి తదితరులు పాల్గొన్నారు

# గణితం కాంప్లెక్స్ సమావేశంలో ఉపాధ్యాయులకు ఘన సన్మానం

**-డిట్టైట్ లెక్చరర్ కొర్ర కృష్ణ కాంత్ నాయక్, ఎండీ మెహరాజ్, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పండిత్ రెడ్డి, ప్రశాంతి లకు సన్మానం**

**మిర్యాలగూడ ప్రతినిధి//సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

మిర్యాలగూడ తెలంగాణ మ్యాథమెటిక్స్ టీఎంఎఫ్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బకలవాడ, మిర్యాలగూడ నందు గణితం కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యారంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డైట్ లెక్చరర్స్‌గా నియమితులైన కొర్ర కృష్ణ కాంత్ నాయక్, ఎండీ మెహరాజ్ అలాగే జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పండిత్ రెడ్డి, ప్రశాంతి లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమా



నికి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కరుణాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థుల్లో గణితంపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను గుర్తించి సన్మానించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలకు అభినందనలు తెలియజేస్తూ, వారు తమ అనుభవం, బోధనా నైపుణ్యాలతో విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత సేవలందించాలని ఆకాంక్షించారు. సన్మాన గ్రహీతలు తమను గుర్తించి గౌరవించిన తెలంగాణ మ్యాథమెటిక్స్ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్పి సైదిరెడ్డి, టీఎంఎఫ్ నాయకులు శ్రీశైలం, శ్రీనివాసరావు, శశిధర్ రెడ్డి, తావూరియా, పద్మ, రామ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జ్యోతి, స్నైలాబ్, గురువారెడ్డి, నాగార్జున రెడ్డి, లోక్య నాయక్, కవిత, వెంకటేశ్వర్లు, గిరిజ, రజిత, బాలు, రామ్ సింగ్, వెంకట్ రెడ్డి, రాంబాయి, రాజ్యలక్ష్మి,శోభ తదితరులు పాల్గొన్నారు.

# పాత్రికేయుడుగా ఆర్ఎంపీ వైద్యుడిగా సేవలందించిన నారాయణ మృతి

**-కన్నీరుతో వీడ్కోలు పలికిన కోలమద్ది గ్రామస్తులు**
**-దిక్కుతోచని స్థితిలో కుటుంబం ఆదుకోవాలంటూ వేడుకలు**

**వార్త సాక్షం సెప్టెంబర్ 26**

పేదరికంలో పుట్టి ఎన్నో కష్టాలను ఎదుర్కొంటూ పాత్రికేయుడిగా, ఆర్ఎంపీ వైద్యుడిగా ప్రజలకు సేవలందించిన మండలంలోని కొల్లమద్ది గ్రామానికి చెందిన ఎడబోయిన నారాయణ(43) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. కొన్నేళ్లుగా పాత్రికేయ వృత్తితో పాటు ఆర్ఎంపీ వైద్యుడిగా గ్రామ ప్రజలకు తనవంతు సేవలు అందిస్తూ మంచి గుర్తింపు పొందారు. నారాయణ మృతితో కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది మృతుడికి భార్య ఎడబోయిన సరితతో పాటు పిల్లలు ప్రణవి (13), శ్రీనిత్య (9), సుహాన్స్ (5) ఉన్నారు. కుటుంబానికి ప్రధాన ఆధారంగా ఉన్న నారాయణ మృతి




చెందడంతో చిన్నారుల భవిష్యత్తుపై ఆందోళన నెలకొంది ఎంతో డబ్బు ఖర్చు చేసిన విధి ఆడిన వింత కాటకంలో ప్రాణాలు కోల్పోయారు పూర్తిగా ఆర్థిక ఇబ్బందుల్లో కురుకుపోయిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం తోపాటు దాతలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, సేవా సంస్థలు పెద్ద మనసుతో ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. కుటుంబానికి అండగా నిలిచి పిల్లల చదువుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు

# అంగన్వాడి కేంద్రంలో ఘనంగా పోషణ్ మహా కార్యక్రమం

**కరీంనగర్ జిల్లా సెప్టెంబర్ 26 వార్త సాక్షం**

తిమ్మాపూర్ మండలం పోలంపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషన్ మాసంలో భాగంగా పోషణ్ మహా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి హాజరై మాట్లాడారు ఈ సంవత్సరం పోషణ్ మాసం సందర్భంగా సెప్టెంబర్ 9వ తేదీ నుండి అక్టోబర్ 8వ తేదీ వరకు పోషణ కార్యక్రమాలు జరుపుకుంటామని అన్నారు మన అంగన్వాడి మన బాధ్యత అనే భావనతో ముందుకు వెళ్తున్నామని అన్నారు ప్రతి



ఒక్కరూ అంగన్వాడి సేవలు వినియోగించుకోవాలని సరైన పోషణతో సరైన ఆరోగ్యం సాధ్యమవుతుందని అన్నారు కేవలం పోషకాహారమే కాకుండా పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి పోలంపల్లి గ్రామ సర్పంచ్ గుంటి లావణ్య మల్లేశం, నర్సింగాపూర్ గ్రామ సర్పంచ్ పెరక రవీందర్, సిడిపిఓ శ్రీలత ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కుమార్ అంగన్వాడి సూపర్వైజర్ పద్మ హై స్కూల్ ఇన్చార్జ్ హెచ్ఎం టి యాదాదేవి ఉపసర్పంచులు పోషణ్ అభియాన్ బీసీ ప్రమీల బీసీ ప్రణీత సఖి కేంద్రం బాధ్యులు కవిత దళిత సూపర్వైజర్లు ఏఎన్ఎం అంగన్వాడీ టీచర్లు ఆశా వర్కర్లు పిల్లలు కిషోర్ బాలికలు తల్లులు తదితరులు పాల్గొన్నారు

# మాడ్గులపల్లి మండల కేంద్రంలో 9వ పోషణ మాసం

**మాడ్గులపల్లి// నల్గొండ//సెప్టెంబర్ 26 వార్త సాక్షం :**

మాడ్గులపల్లి మండలంలో 9వ పోషణ మహా ప్రోగ్రాం కేజీబీవీ మాడుగులపల్లి మండల కేంద్రంలో చేయడం జరిగింది. ఈ ప్రోగ్రాం లో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో వంశీధర్ మాట్లాడుతూ గవర్నమెంట్ ఎలాంటి లాభాపేక్ష లేకుండా సరి అయిన సమతుల పోషకాహారం అందిస్తుంది మంచి విద్య అందిస్తుంది కాబట్టి మీరు ఈ సేవలనీ సద్వినియోగం చేసుకొని ప్రయోజకులు కావాలని సూచించారు. సిడిపిఓ శాంతి మేడం మాట్లాడుతూ 9వ పోషణ మహా ప్రోగ్రాం ప్రాముఖ్యతను తెలియజేస్తూ పోషణ అంటే ప్రోటీన్స్ విటమిన్స్ ఖనిజ లవణాలు పిండి పదార్థాలు సమతుల్యతతో తీసుకొని ఆరోగ్య విద్యార్థిగా చదువుకోవాలి పరిశుభ్రత గురించి ఆరు రకాల పద్ధతుల గురించి మరియు రాబోయే తరాలకు మరియు మీ ఫ్యామిలీస్ కి మీ ఇంటి దగ్గర గర్భిణీ బాలింతలకు ఈ ప్రోగ్రాంలో మీరు తెలుసుకున్నవి అన్ని వారికి అవగాహన కల్పించాలి అని చెప్పినారు. ఎంఈఓ వెంకటమ్మ మేడమ్ మాట్లాడుతూ ఇప్పుడు ప్రస్తుత కాలంలో అధిక దిగుబడి కోసం లాభాల కోసం ఎక్కువ మందులు పంట పొలాలకి వేసి పండిస్తున్నారు కావున మనం డైరెక్ట్ గా తీసుకోవద్దు



ఒక అరగంట ఉప్పు నీళ్లలో నానబెట్టి శుభ్రంగా కడిగి వాడాలి క్యాన్సర్ బారిన పడకుండా మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి అని సూచించారు సర్పంచ్ ఆరూరి నరేష్ మాట్లాడుతూ ఇప్పటి పిల్లలు ఎక్కువగా జంక్ ఫుడ్ థమ్స్ అప్ కూల్ డ్రింక్స్ తినకుండా వాటికి దూరంగా మన ఇంట్లో అమ్మ ప్రేమతో ఎంతో పోషకాహారంతో ఎంతో రుచికరంగా తయారుచేసిన ఫుడ్ ని తీసుకుని ఆరోగ్యం గా ఉండాలి మంచిగా చదువుకోవాలి. అని సూచించారు కేజీబీవీ ప్రిన్సిపాల్ మేడం సునీత మాట్లాడుతూ అందరి అధికారుల సూచనలు ఎంతో అమూల్యమైనవి అని విద్యార్థులు తప్పకుండా పాటించి ఆరోగ్యంగా ఉండి చదువుకోవాలి అని సూచించారు ఐసిడిఎస్ సూపర్వైజర్ లక్ష్మి మరియు నాగరాణి మాట్లాడుతూ వెయ్యి రోజుల ప్రాముఖ్యతను అంటే బిడ్డ కడుపులో



ఉన్నప్పటినుండి పుట్టిన 24 నెలల వరకు మెదడు గ్రోతు చాలా ఫాస్ట్ గా జరుగుతుంది. కాబట్టి కిషోర్ బాలికగా ఉన్నప్పుడే సరైన ఆహారం తీసుకొని గర్భిణీ ~ గా ఉన్నప్పుడు కూడా సరైన పోషకాహారం తీసుకోవాలి అని సూచించారు ఈ ప్రోగ్రాం ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ ప్రోగ్రాం కి290 మంది కిషోర్ బాలికలు ఎంపీడీవో వంశీధర్ సిడిపిఓ శాంతి మేడం ఎంఈఓ వెంకటమ్మ మేడం సర్పంచ్ ఆరూరి నరేష్ ఉప సర్పంచ్ మల్లేపల్లి వెంకన్న, పోలీస్ డిపార్ట్మెంట్, నుండి ఖదీర్ పాషా. ఆంజనేయులు, సంఘ బంధం నుండి సీసీ వి రమణ, కేజీబీవీ ప్రిన్సిపల్ సునీత, కేజీబీవీ స్టాఫ్ మరియు అంగన్వాడీ టీచర్స్ ఏఎన్ఎం మరియు సూపర్వైజర్స్ పాటిస్పేట్ చేయడం జరిగింది.

# ఎస్‌జీఎఫ్ అండర్--19 బాలికల ఖో--ఖో టోర్నమెంట్--కమ్--సెలక్షన్స్ విజయవంతం

**వార్త సాక్షం సెప్టెంబర్ 26**




ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని జూనియర్ కళాశాలల విద్యార్థినులకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్--19 బాలికల ఖో--ఖో టోర్నమెంట్--కమ్--సెలక్షన్స్ విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా కరీంనగర్ జిల్లా డి.సి.బి.ఈ. కార్యదర్శి భగవంతయ్య క్రీడాకారిణులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. అనంతరం క్రీడాకారిణులతో ముచ్చటిస్తూ వారి క్రీడా ప్రతిభ, సాధన, భవిష్యత్ లక్ష్యాలను తెలుసుకున్నారు. క్రీడల్లో ప్రతిభతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధన, క్రీడాస్ఫూర్తి ఎంతో ముఖ్యమని సూచించారు. క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులు, కళాశాల, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని క్రీడాకారిణులకు సూచించారు. ఈ సందర్భంగా బి. వేణుగోపాల్ మాట్లాడుతూ, ఖో--ఖో క్రీడ విద్యార్థినుల్లో శారీరక దృఢత్వం, వేగం, చురుకుదనం, ఏకాగ్రత, సమయస్ఫూర్తి, క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తిని పెంపొందించడంలో ఎంతో దోహదపడుతుందని తెలిపారు. క్రీడల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభను వెలికితీసుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడల్లో క్రమశిక్షణతో పాటు పట్టుదల, నిరంతర సాధన ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. జిల్లా కార్యదర్శి ఎల్. బన్సీలాల్ మాట్లాడుతూ, ఈ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణులను రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులు రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

**టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులు అందజేశారు.**

ప్రథమ బహుమతి: టీజీఎంఎస్ మేడిపల్లి ద్వితీయ బహుమతి: టీజీఎంఎస్ నూకపల్లి విజేత జట్లకు జిల్లా కార్యదర్శి ఎల్. బన్సీలాల్, బి. వేణుగోపాల్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో పీడీలు సరిత, ప్రసాద్, అశోక్, రాజశేఖర్, బానోత్ రాజు, అజీమ్, రమేష్, లావణ్య, శ్రీనివాసు, లీలారాణి, పవన్, ప్రణీత, శైలజ అరుణ శ్రీవిద్య, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-ఎమ్మెల్యే గండ్రసత్య నారాయణ రావు..**

వార్త సాక్షం సెప్టెంబర్ 26





భూపాలపల్లి నియోజకవర్గం టేకుమట్ల మండలం పంగిడిపల్లి గ్రామంలో 10 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించిన మహిళా సంఘం భవన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ మహిళలు,మహిళా సంఘాల సభ్యులు ఎమ్మెల్యే కి ఘన స్వాగతం పలికి పూలమాలలు వేసి సన్మానించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలను స్వయం సమృద్ధి దిశగా నడిపించే లక్ష్యంతో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.గ్రామీణ ప్రాంత మహిళలు సంఘటితంగా ముందుకు సాగి ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడానికి ప్రతి గ్రామంలో మహిళా సంఘాలకు ప్రత్యేక భవనాలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలుగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా వేలాది మంది మహిళలు చిన్నచిన్న పొదుపులతో ప్రారంభించి నేడు స్వయం ఉపాధి రంగాల్లో విజయవంతంగా రాణిస్తున్నారని అన్నారు. మహిళా సంఘాలకు బ్యాంకు రుణాలు, వడ్డీ రాయితీలు, శిక్షణ కార్యక్రమాలు, మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తూ వారి ఆదాయాన్ని పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ, సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు వంటి ఆదాయ వనరులను మహిళా సంఘాలకు అందజేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. దీనివల్ల మహిళలు ఉపాధి పొందడమే కాకుండా కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరుచుకునే అవకాశం కలుగుతుందన్నారు. మహిళలు వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో కూడా ముందుకు రావాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే మహత్తర లక్ష్యంతో పనిచేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. మహిళల సాధికారత ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని, మహిళలు బలపడితే కుటుంబం, గ్రామం, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని అన్నారు. అందుకే మహిళా సంఘాల అభివృద్ధికి అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు ప్రభుత్వం అంది స్తోందని చెప్పారు. మహిళలు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, స్వయం ఉపాధి రంగాల్లో విజయాలు సాధించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. మహిళా సంఘాల ద్వారా గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు, మహిళా సంఘాల నాయకులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సాంస్కృతిక ఐక్యతకు దోమకొండ కోటచిహ్నం

**-నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవశీ**

**-కవి లెక్చరర్ ఉమాశేషారావు వైద్య**

కామారెడ్డి సెప్టెంబర్ 26, వార్త సాక్షం





మనిషికి ఎన్ని ఉన్నా ఎంత ఉన్నా ప్రకృతి పట్ల ఆకర్షణ ఉం టుంది ప్రపంచంలో చాలా వింత ప్రదేశాలు, చారిత్రక కట్టడాలు, జలపాతాలు, కొండలు, లో నలు, శీతల ప్రాంతాలు స ము ద్ర తీర ప్రాంతాలు పర్యట క ప్రాంతాలుగా చెబుతారు. మనిషి మానసిక ఆనందానికి ప్రేరణ కు అవి తోడ్పడతాయి. 2024 ప్రపంచ టూరిజం యొ క్క ఉద్దేశం పర్యటకము మరి యు శాంతిగా ప్రకటించింది. ప్రపంచ ప్రజల మధ్య సామర స్యాన్ని మరియు అవగాహ న ను పెంపొం దించడం లోప్రయా ణం యొక్క ముఖ్య పాత్రను తెలుపుతుంది. ఈ ప్రయాణం వల్ల ప్రపంచ ప్రజల మధ్య ఒక భావనఏర్పడుతుంది.ప్రపంచం లో కొన్ని దేశాలు శాంతి మరియు స్థిర త్వానికి పర్యావ రణమే ఒక కారణం రెండు ప్రపంచ యుద్దా లు జరిగిన ఏ యుద్ధంలో పా ల్గొనకుండా త టస్థంగా ఉన్న స్విట్జర్లాండ్ దే శం అత్యధిక శాతశీ పర్యటక రంగం ద్వారానే ఆదాయాన్ని ప్రపంచంలో ఆరు అత్యంత శాంతియుత దేశాలు గా ఉ న్నాయి. ఐస్లాండ్, ఐర్లాండ్, ఆస్ట్రియా, న్యూజిలాండ్, సింగపూర్ ఇవి ప్రపంచంలోని చాలా దేశాల ప్రజలను ఆకర్షిం చి ఆదాయాన్ని పొందడమే కా కుండా ప్రపంచ ప్రజల మధ్య సామరస్యాన్ని పెంపొందిస్తుం ది. 1980 నుండి ఐక్యరా జ్య సమితి ప్రపంచ పర్యాటక సం స్థ ఈ వేడుకలను సెప్టెంబర్ 27న నిర్వహిస్తుంది. 1970లో యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూ రిజం ఆర్గనైజేషన్ దీన్ని స్వీక రించింది. ఈ టూరిజం అన్నది ప్రపంచవ్యాప్తంగా సామాజిక సాంస్కృతిక రాజకీయ ఆర్థిక విలువలను ఎలా ప్రభావితం చేసిందో చూడడం, 1997 అక్టో బర్ లో ఇస్తాంబుల్, టర్కీలో జరిగిన ఐక్యరాజ్యసమితి ప్రతినిధి సభ 12వ సమావే శం లో ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకల్లో భాగస్వామిగా వ్యవహరించ డానికి ఒక అతిథి దేశాన్ని కేటాయించాల ననిర్ణయి ంచిందిప్రపంచ పర్యాటక దినోత్సవం చేయడంలో ముఖ్యమైన అంశం ప్రపంచవ్యాప్త పురోగతి సామాజిక మెరుగుదలకు ఒక సాధనంగా పర్యటకము పేర్కొ న్నారు. సుస్థిర అభివృద్ధి కోసం 2030 ఎజెండాలో పే ర్కొ న్న ప్రపంచ సవాళ్ల గురిం చి అవగాహన కల్పించడానికి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించడానికి పర్యాటక పరి శ్రమ చేయగలిగే ప్రయత్నా లను తెలవడానికి ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. గత కొన్ని దశాబ్దాల్లో అంతర్జాతీయ పర్యాటకుల రాక గణనీయం గా పెరిగింది. 1950లో 25 మిలియన్ల నుండి 2019లో 1.3 బిలియన్లకు పెరిగింది. రెండు బిలియన్ డాలర్లుగా ఉన్న ఆదాయం 2015 నాటికి ఒక వెయ్యి రెండు వందల అర వై బిలియన్ డాలర్లకు పెరిగింది. పర్యాటక రంగం ప్రపంచం లో జిడిపిలో 10 శాతం విలువ చేస్తుందనిఅంచనావేయబడింది. ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది ఉద్యోగాలలో ఒకటి అందిస్తుం ది. 2030 వరకు పర్యాటక రంగంలో శాతం వార్షిక వృద్ధి ఉంటుందని యుఎన్ డబ్ల్యు టి ఓ అంచనావేస్తోంది. భార తదేశంలో ఈవర్షక్రమద్యా రా 2018 లో 240 బిలియన్ డాలర్లు లేదా భారత జిడిపిలో 9.2 శాతం ఉంటుందని అంచ నా చేయబడింది. ఈ పరిశ్రమ భారతదేశంలో 42.6 మిలియ న్ల మందికి ఉపాధి కల్పిస్తుం ది. అని అంచనా పర్యటక మంత్రి త్వ శాఖ గణాంకాల ప్రకారం 2017 లో 10.04 మిలియన్ల విదేశీ పర్యాటకులు భారతదే శానికి రావడం జ రి గింది. వరల్డ్ ఎకనామిక్ ఫో రం ట్రావెలింగ్ టూరిజం డెవలప్మెం ట్ ఇండెక్స్ 2024 విడుదల చేయగా దక్షిణాసియాలో భార త దేశ పర్య టక రంగం 39 వ స్థానంలో ఉంది. ప్రపంచ ప్రజ ల మధ్య సాంస్కృతిక పరిర క్షణకు పర్యటక రంగం నుండి వచ్చే ఆదాయం వల్ల మెరుగైన జీవన ప్రమా ణాలు ఆరోగ్యం విద్య ఇతర అవసరాలకు లభిస్తుంది. తెలంగాణలో కూడా రామాప్ప దేవాలయం యునెస్కోచే వారసత్వ కట్ట డంగా గుర్తించ బడింది. ఇలా ఉమ్మడి రాష్ట్రం లో అనేక పర్యటక ప్రాంతాలు ఉన్నాయి. కామారెడ్డి జిల్లా దోమకొండ లో గడికోట లింగం పేటలోనాగన్న బావి సిరిస్సిల్ల కోట ఆదిలాబా ద్ జిల్లాలో కుంతల జలపా తం, భోగత జలపాతం ప్రతి జి ల్లా కేంద్రంలో ఏదో ఒక విశేషమైన చారిత్రక కట్టడం ఉంది. టూరిజం క్లబ్బు ల ద్వారాపర్య టకులను ఆక ర్షించడంతో పా టు మౌలిక వస తులనుకల్పిం చే బాధ్యత కూడా ప్రభుత్వా లు తీసుకోవాలి. సాంస్కృ తి క ఐక్యతతో పాటు ఉపా ధి అవకాశాలను కల్పిస్తుంది భారతదేశంలో తాజ్ మహల్ అందాలు నేటికి కూడా చెక్కు చెదరకుండా ఉన్నాయి. ఉపా ధి అవకాశాలను కల్పించేవర్క ఒక రంగాన్నిప్రోత్సహిద్దాం. మానసిక వికాసానికి, అంతర్జా తీయ శాంతికి పర్యటక రంగం ఎం తో తోహద పడుతుంది. మాల్దీవుల తో పోటీ పడే విధంగా పండిచ్చేరి గోవాలు మనదేశం లో ఉన్నాయి.

# గణపతికి ప్రత్యేక పూజలు

**-ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**

వార్త సాక్షం సెప్టెంబర్ 26 :



వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.వెల్దండ పట్టణంలోని ఛత్రపతి శివాజీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన మట్టి గణపతి విగ్రహానికి శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితి పండుగ మన సంప్రదాయాలు, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. పండుగను ఘనంగా నిర్వహించడంతో పాటు ప్రకృతికి ఎలాంటి హాని కలగకుండా పర్యావరణహిత పద్ధతులను పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు.మట్టి గణపతి విగ్రహాలను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడవచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను ప్రతిష్ఠించి పర్యావరణహిత వినాయక చవితిని జరుపుకోవాలని కోరారు.రాబోయే తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, స్థానిక మీడియా మిత్రులు, స్థానిక నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కొండగట్టులో ఘనంగా ముగిసిన పవిత్రోత్సవాలు

**-ప్రత్యేక అభిషేకాలు మహాపూర్ణాహుతి పవిత్ర సమర్పణతో ముగింపు**





సెప్టెంబర్ 26 వార్త సాక్షం:

కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి దేవస్థానంలో మూడు రోజులుగా వైభవంగా నిర్వహించిన పవిత్రోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఈఓ అంజన్న రెడ్డి ఆధ్వర్యంలో పవిత్రోత్సవాల చివరి రోజు అయినా ఉదయం శ్రీ ఆంజనేయ స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి అనంతరం పట్టు వస్త్రాలతో విశేషంగా అలంకరించారు. యాగశాలలో అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య మూలమంత్ర హోమాలను నిర్వహించి అనంతరం మహాపూర్ణాహుతి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాపూర్ణాహుతి అనంతరం యాగశాల నుంచి దేవాలయం వరకు ఉత్సవమూర్తులతో పాటు పవిత్రాలను తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామి వారికి పట్టు పవిత్రాలను అలంకరించి కుంభ ప్రోక్షణ పవిత్ర సమర్పణ కార్యక్రమాలను ఆగమ శాస్త్రానుసారం నిర్వహించారు. చివరగా వేద పండితుల ఆధ్వర్యంలో ఆశీర్వచనం కార్యక్రమం నిర్వహించడంతో పవిత్రోత్సవాలు సంపూర్ణంగా ముగిశాయి. పవిత్రోత్సవాల సందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక పూజలు హోమాలు శోభాయాత్ర మరియు పవిత్ర సమర్పణ కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులయ్యారు.

## చాకలి ఐలమ్మ సేవలు స్ఫూర్తిదాయకం




వార్త సాక్షం సెప్టెంబర్ 26:

తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ జీవితం, పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భూస్వాముల ఆధిపత్యానికి వ్యతిరేకంగా ఐలమ్మ చేసిన పోరాటాన్ని, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆమె పోషించిన పాత్రను ఈ సందర్భంగా నాయకులు స్మరించుకున్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆమె చేసిన కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు జే.కే. శేఖర్ యాదవ్, ఉప్పల్ అసెంబ్లీ ఓబీసీ మోర్చా కన్వీనర్ ఆనంద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్, అధికార ప్రతినిధి ఉలుగొండ నారాయణదాసు, జిల్లా కార్యదర్శి పిసరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాపన్నపేటలో ఘనంగా చాకలి ఐలమ్మ వేడుకలు



పాపన్నపేట, సెప్టెంబర్ 26 వార్త సాక్షం

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, వీర వనిత చాకలి అయిలమ్మ జయంతి వేడుకలను శనివారం పాపన్నపేట మండల కేంద్రంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూల మాలలు వేసి, కొబ్బరికాయ లు కొట్టి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ.. భూమి కోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం, అణగారిన వర్గాల హక్కుల కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అన్యాయాన్ని ఎదిరించి ధైర్యంగా నిలిచిన వీర వనిత చాకలి ఐలమ్మ జీవితం మహిళ లోకానికి, నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. అని పోరాట స్ఫూర్తిని ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాపన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లింగంపేట నరేందర్ గౌడ్, పాపన్నపేట ఎస్సై సారా శ్రీనివాస్ గౌడ్, బికొండ రాములు, రజక సంఘం మండల అధ్యక్షుడు గోపాల్, పి, సుమన్, తాజా మాజీ సర్పంచ్ తిమ్మయ్యగారి గురుమూర్తి గౌడ్, సుంకరి శివయ్య, ఎండి. గౌస్, పోతే దార్ మల్లన్న, లింగారెడ్డి, ఎండి, బాబర్ పటేల్, కుర్తివాడ ప్రసాద్ గౌడ్, కడారి ప్రభు, వెంకటేశం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

VARTHAA SAKSHAMU RNI Title Code: APTEL/25/A5153
వార్త సాక్ష్యం
తెలుగు దిన పత్రిక
Editor : SAGINALA RAVI KUMAR



# బిజినెస్

## పెరిగిన పీఎఫ్ వేతన పరిమితి.. మీ శాలరీ, పొదుపు పై ఎలాంటి ప్రభావం ఉంటుంది



నెల జీతం వస్తుంది.. ఖర్చులు పోతాయి.. మిగిలిన దాంట్లో కొంత పీఎఫ్‌లోకి వెళుతుంది. ఉద్యోగ జీవితంలో పెద్దగా పట్టించుకోని ఈ చిన్న మొత్తం.. రిటైర్మెంట్ సమయానికి పెద్ద మొత్తంగా మారుతుంది. ఇప్పుడు పీఎఫ్ లెక్కల్లో కీలక మార్పు వచ్చింది. వేతన పరిమితిని రూ.15 వేల నుంచి రూ.25 వేలకు పెంచడంతో ఉద్యోగుల నెలవారీ పొదుపు పెరగనుంది. మరి ఈ మార్పుతో మీ జీతం నుంచి ఎంత పీఎఫ్ కట్ అవుతుంది? సంస్థ ఎంత జమ చేస్తుంది? పెన్షన్‌పై ప్రభావం ఏంటి?

### అసలు మార్పు ఏంటి?

ఇప్పటివరకు పీఎఫ్ కోసం నెల జీతంలో గరిష్ఠంగా రూ.15 వేలనే పరిగణించేవారు. ఈ మొత్తంపై 12 శాతం చొప్పున ఉద్యోగి, సంస్థ పీఎఫ్‌కు రూ.1,800 చొప్పున చెల్లించేవారు. ఇప్పుడు ఈ పరిమితిని రూ.25 వేలకు పెంచారు. అంటే 12 శాతం లెక్కన ఉద్యోగి వాటా రూ.3,000 వరకు పెరగొచ్చు. సంస్థ కూడా రూ.3,000 వరకు జమ చేయొచ్చు. దీంతో పీఎఫ్ ఖాతాలోకి వెళ్లే మొత్తం పెరుగుతుంది.

### పెన్షన్ వాటా కూడా పెరుగుతుంది

పీఎఫ్‌లో సంస్థ చెల్లించే 12 శాతం మొత్తంలో కొంత భాగం ఉద్యోగుల పెన్షన్ పథకం (ఈపీఎస్)కు వెళుతుంది. గతంలో రూ.15 వేల పరిమితిపై 8.33 శాతం లెక్కన నెలకు గరిష్ఠంగా రూ.1,250 ఈపీఎస్‌కు వెళ్లేది. ఇప్పుడు పరిమితి రూ.25 వేలకు పెరగడంతో ఈపీఎస్ వాటా నెలకు రూ.2,083 వరకు పెరిగే అవకాశం ఉంది. దీంతో ఉద్యోగి భవిష్యనిధితో పాటు పెన్షన్ ప్రయోజనం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

## ఒక్క ఛార్జింగ్‌తో 1,338 కి.మీ.. ఆడి ఎలక్ట్రిక్ కారు సరికొత్త రికార్డు

ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే ఎలక్ట్రిక్ కారు ఎంత దూరం వెళుతుంది? సాధారణంగా కంపెనీలు చెప్పే లెక్కలే మనకు గుర్తొస్తాయి. కానీ ఓ ఆడి ఎలక్ట్రిక్ కారు ఏకంగా 1,338 కిలోమీటర్లు ప్రయాణించి అందరినీ ఆశ్చర్యపరిచింది. పోలాండ్‌లో జరిగిన ఈ ప్రయత్నంలో, మధ్యలో ఒక్కసారి కూడా ఛార్జింగ్ చేయకుండా ఈ దూరాన్ని పూర్తి చేసింది.



### 45 గంటలకు పైగా ప్రయాణం

ఆడి ఏ6 స్పోర్ట్‌బ్యాక్ ఈ-ట్రాన్ పెర్ఫార్మెన్స్‌తో పోలాండ్‌కు చెందిన ర్యాలీ డ్రైవర్ మికో మార్జిక్ ఈ రికార్డు ప్రయత్నం చేశారు. సెప్టెంబర్ 11న తెల్లవారుజామున 1.55 గంటలకు ప్రయాణం మొదలైంది. 45 గంటలకు పైగా సాగిన ప్రయాణం తర్వాత టోరున్-సిచోచినెక్ మధ్య ముగిసింది. క్రాకోవ్, సాండోమియెర్జ్, వార్సా, టోరున్, గ్రుడ్జియాడ్జ్, బాల్టిక్ సముద్ర తీరంలోని హెల్ వంటి ప్రాంతాల మీదుగా కారు ప్రయాణించింది. సాధారణ ట్రాఫిక్‌లోనే ఈ డ్రైవ్ సాగింది. రద్దీ సమయాల్లోనూ కారు నడిచింది. మధ్యలో ఎక్కడా ఛార్జింగ్ చేయలేదు.

### కంపెనీ లెక్కను మించి 561 కి.మీ.

ఆడి ఏ6 స్పోర్ట్‌బ్యాక్ ఈ-ట్రాన్ పెర్ఫార్మెన్స్ సాధారణ పరీక్షల్లో గరిష్ఠంగా 777 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని కంపెనీ చెబుతోంది. అయితే ఈ రికార్డు ప్రయత్నంలో ఏకంగా 1,338 కిలోమీటర్లు వెళ్లింది. అంటే సాధారణ లెక్క కంటే మరో 561 కిలోమీటర్లు ఎక్కువ. ఈ ప్రయాణంలో కారు 100 కిలోమీటర్లకు కేవలం 7.09 కిలోవాట్‌అవర్ విద్యుత్‌ను మాత్రమే వినియోగించింది. కారులో 100 కిలోవాట్‌అవర్ సామర్థ్యం ఉన్న బ్యాటరీ ఉంది. అందులో 94.9 కిలోవాట్‌అవర్ వినియోగించుకోగల సామర్థ్యం ఉంది.

### డ్రైవింగ్ పద్ధతే కీలకం

మార్జిక్ వేగం కంటే మైలేజీకి ప్రాధాన్యం ఇచ్చారు. ఒకే వేగాన్ని సాధ్యమైనంత వరకు కొనసాగించారు. ట్రాఫిక్‌ను ముందుగానే అంచనా వేశారు. అనవసర యాక్సిలరేషన్, బ్రేకింగ్‌ను తగ్గించారు. టైర్లలో సరైన గాలి ఉండేలా చూసుకున్నారు. బ్రేక్ వేసినప్పుడు కొంత శక్తిని తిరిగి బ్యాటరీలోకి పంపే రీజెనరేటివ్ బ్రేకింగ్‌ను ఎక్కువగా ఉపయోగించారు.

### ఏరోడైనమిక్స్ కూడా కీలకమే

ఈ కారు ఆడి రూపొందించిన ప్రీమియం ప్లాట్‌ఫామ్ ఎలక్ట్రిక్ టెక్నాలజీపై తయారైంది. 800 వోల్ట్ ఎలక్ట్రికల్ సిస్టమ్ ఇందులో ఉంది. కారు గాలి నిరోధకత కూడా చాలా తక్కువగా ఉండేలా డిజైన్ చేశారు. కారు బ్రేకింగ్ సమయంలో కూడా శక్తిని తిరిగి పొందుతుంది. ఈ వ్యవస్థ గరిష్ఠంగా 220 కిలోవాట్ల వరకు శక్తిని రికవర్ చేయగలదని ఆడి తెలిపింది.

### రోజువారీ ప్రయాణానికి మాత్రం కాదు

1,338 కిలోమీటర్ల ప్రయాణం ఆకట్టుకుంటున్నా.. రోజువారీ వినియోగంలో ఇదే రేంజ్ వస్తుందని భావించకూడదు. హైవేపై ఎక్కువ వేగం, ఏసీ లేదా హీటర్ వినియోగం, బ్యాటరీలో కొంత ఛార్జింగ్ మిగిల్చడం వంటి అంశాలు రేంజ్‌ను తగ్గిస్తాయి.

## బ్యాంక్ ఖాతాదారులకు అలర్ట్.. 3 రోజులు సమ్మె.. ముందే ఈ పనులు పూర్తి చేసుకోండి!



దేశవ్యాప్తంగా బ్యాంకు ఉద్యోగ సంఘాలు సెప్టెంబర్ 28 నుంచి 30 వరకు మూడు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యూఎఫ్‌బీయూ) ఆధ్వర్యంలో ఈ సమ్మె జరగనుంది. దీంతో పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో (ఆర్ఆర్‌బీలు) బ్రాంచ్ సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సమ్మెకు ముందు వారాంతపు సెలవులు ఉండటంతో వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకు శాఖల సేవలు ప్రభావితమయ్యే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ఖాతాదారులు ముఖ్యమైన నగదు లావాదేవీలు, చెక్కులు, ఇతర బ్రాంచ్ పనులను ముందుగానే పూర్తి చేసుకోవాలని బ్యాంకులు సూచిస్తున్నాయి. ఖాతాదారులకు ఇబ్బందులు తగ్గించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 27న ఆదివారం అయినప్పటికీ ప్రభుత్వ రంగ బ్యాంకులు, ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు సాధారణంగా పనిచేయనున్నాయి. అన్ని బ్యాంకు శాఖలు, కార్యాలయాలు, ఏటీఎం-లింక్ శాఖలు పనిచేసేందుకు ఆర్‌బీఐ అనుమతి ఇచ్చింది.

### ఏం కోరుతున్నారు?

వారానికి ఐదు రోజుల బ్యాంకింగ్ విధానాన్ని అమలు చేయడంతో పాటు ఉద్యోగులకు సంబంధించిన ఇతర అంశాలపై యూనియన్లు డిమాండ్లు చేస్తున్నాయి. ప్రభుత్వం సమ్మెను విరమించాలని కోరుతూ చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేసింది. అయితే సెప్టెంబర్ 28-30 సమ్మెకు యూనియన్లు ముందుకు సాగుతున్నట్లు తాజా సమాచారం.

## ఫోకస్ అంతా రో-కో పైనే.. 51 పరుగులు చేస్తే కోహ్లీ చరిత్ర!




టీమిండియా స్వదేశీ సీజన్‌కు సిద్ధమైంది. వెస్టిండీస్‌తో మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా తొలి మ్యాచ్ ఆదివారం జరగనుంది. తిరువనంతపురంలోని గ్రీన్‌ఫీల్డ్ స్టేడియం ఈ పోరుకు వేదిక కానుంది. ఈ మ్యాచ్‌లో అందరి చూపు సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీపైనే ఉంది. వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌కు భారత్ ఇప్పటి నుంచే సన్నద్ధమవుతోంది. అయితే గాయాలు, ఆసియా క్రీడల కారణంగా పలువురు కీలక ఆటగాళ్లు జట్టుకు దూరమయ్యారు. దీంతో అందుబాటులో ఉన్న ఆటగాళ్లతో జట్టు కూర్పు ఎలా ఉంటుందన్నది ఆసక్తిగా మారింది. ఇటీవల ఇంగ్లాండ్‌తో లార్డ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో రోహిత్ 138 పరుగులతో అదరగొట్టాడు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత 15 ఇన్నింగ్స్‌ల్లో రెండు సెంచరీలు చేశాడు. అయితే ఎనిమిది సార్లు 30లోపే ఔటయ్యాడు. పవర్‌ప్లేలో అతడి బ్యాటింగ్ వేగంపైనా చర్చ జరుగుతోంది. మరోవైపు విరాట్ కోహ్లీ అరుదైన మైలురాయికి చేరువలో ఉన్నాడు. వన్డేల్లో 15 వేల పరుగులు పూర్తి చేసేందుకు అతడికి 51 పరుగులు మాత్రమే కావాలి. ఈ ఘనత సాధిస్తే సచిన్ తర్వాత ఆ మార్క్‌ను అందుకున్న రెండో ఆటగాడిగా నిలుస్తాడు. గత 12 వన్డేల్లో ఎనిమిది సార్లు 50కిపైగా పరుగులు చేశాడు.

### నితీశ్ కు చాన్స్ పక్కా!

హార్దిక్ పాండ్యా, హర్షిత్ రాణా గాయాలతో జట్టుకు దూరమయ్యారు. అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్ ఆసియా క్రీడల కోసం వెళ్లారు. దీంతో నితీశ్ కుమార్ రెడ్డికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ స్పిన్ బాధ్యతలు చేపట్టనున్నారు. న్యూజిలాండ్, శ్రీలంకతో సిరీస్‌లు కోల్పోయిన వెస్టిండీస్ ఈ సిరీస్‌లో సత్తా చాటాలని చూస్తోంది. వచ్చే ఏడాది ప్రపంచకప్ క్వాలిఫయర్స్‌కు ముందు ఈ సిరీస్ ఆ జట్టుకు కీలకం. 19 ఏళ్ల స్పిన్నర్ విటెల్ లాస్‌పైనా ఆసక్తి నెలకొంది. ఐదు వన్డేల్లో అతడు ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. మ్యాచ్ ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమవుతుంది. స్టార్ స్పోర్ట్స్ నెట్‌వర్క్‌లో ప్రత్యక్ష ప్రసారం ఉంటుంది.

## ఏషియన్ గేమ్స్‌లో సింధు జోరు.. ప్రీ-క్వార్టర్స్‌కు దూసుకెళ్లిన స్టార్ షట్లర్



ఏషియన్ గేమ్స్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు దూసుకెళుతోంది. మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో చైనీస్ తైపీకి చెందిన చియు పిన్-చియాన్‌పై 21-19, 21-14 తేడాతో విజయం సాధించింది. దీంతో రౌండ్-16 (ప్రీక్వార్టర్ ఫైనల్) లోకి ప్రవేశించింది. తొలి గేమ్‌లో సింధుకు ప్రత్యర్థి నుంచి గట్టి పోటీ ఎదురైంది. బ్రేక్ సమయానికి ఆమె 10-11తో వెనుకబడింది. ఆ తర్వాత పుంజుకున్న సింధు ఆధిక్యంలోకి వచ్చింది. రెండు గేమ్ పాయింట్లను చేజార్చుకున్నప్పటికీ.. మూడో గేమ్ పాయింట్‌ను సద్వినియోగం చేసుకుని తొలి గేమ్‌ను 21-19తో సొంతం చేసుకుంది. రెండో గేమ్‌లో సింధు మరింత దూకుడుగా ఆడింది. బ్రేక్ సమయానికి 11-7తో ఆధిక్యంలో నిలిచింది. ఆ తర్వాత ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వకుండా 21-14తో గేమ్‌ను ముగించింది. 2-0తో మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. రౌండ్-16లో సింధు జపాన్‌కు చెందిన తోమోకా మియాజాకితో తలపడనుంది. ఈ మ్యాచ్ శనివారమే జరగనుంది. గతంలో ఇదే ఏషియన్ గేమ్స్‌లో మహిళల టీమ్ క్వార్టర్‌ఫైనల్లో భారత్.. జపాన్ చేతిలో ఓడింది. గత హాంగ్‌జౌ ఏషియన్ గేమ్స్‌లో మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లోనే సింధు నిష్క్రమించింది. ఈసారి పతకం సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగింది. ఇక భారత యువ షట్లర్ ఉన్నతి హుడా కూడా రౌండ్-16కు చేరింది. రెండో రౌండ్‌లో మలేషియాకు చెందిన వాంగ్ లింగ్ చింగ్‌పై 21-14, 20-22, 21-9తో గెలిచింది. మరోవైపు, పురుషుల సింగిల్స్ విభాగంలో ఆయుష్ శెట్టి కజకిస్థాన్‌కు చెందిన మఖ్సుత్ తజిబుల్లయేవ్‌పై 21-7, 21-7తో విజయం సాధించాడు. అయితే లక్ష్యసేన్ రెండో రౌండ్‌లో సింగపూర్‌కు చెందిన లోహ్ కీన్ యూపై 12-21, 21-15, 14-21తో ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించాడు.

# స్పోర్ట్స్

## కబడ్డీలో భారత్ డబుల్ గోల్డ్.. ఇరాన్‌ను ఓడించి పురుషుల జట్టు స్వర్ణం కైవసం

- ఫైనల్లో ఇరాన్ పై 40-34 తేడాతో ఉత్కంఠభరిత విజయం
- ఒకే రోజు కబడ్డీలో స్వర్ణాలు సాధించిన మహిళల, పురుషుల జట్లు
- గత టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్న భారత జట్లు




ఆసియా క్రీడల్లో భారత కబడ్డీ జట్లు స్వర్ణ పతకాలతో మెరిశాయి. నేడు జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్స్‌లో పురుషుల, మహిళల జట్లు రెండూ ఇరాన్‌ను ఓడించి తమ టైటిళ్లను విజయవంతంగా నిలబెట్టుకున్నాయి. దీంతో భారత కబడ్డీ ఒకే రోజు రెండు స్వర్ణాలను ఖాతాలో వేసుకుని సంబరాలు చేసుకుంది. పురుషుల ఫైనల్ ఆద్యంతం హోరాహోరీగా సాగింది. భారత జట్టు 40-34 తేడాతో ఇరాన్ పై విజయం సాధించి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. ఒక దశలో ఇరు జట్ల స్కోర్లు 20-20తో సమంగా నిలిచాయంటే పోరు ఎంత తీవ్రంగా సాగిందో అర్థం చేసుకోవచ్చు. అయితే, కీలక సమయంలో పుంజుకున్న భారత క్రీడాకారులు ఇరాన్‌పై పైచేయి సాధించి విజయాన్ని అందుకున్నారు. వరుసగా ఏడుసార్లు స్వర్ణాలు గెలిచిన భారత పురుషుల జట్టు, 2018 జకార్తా గేమ్స్‌లో ఇరాన్ చేతిలో ఓడి నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అయితే, ఆ తర్వాత పుంజుకుని 2023లో టైటిల్ గెలిచి, ఇప్పుడు దాన్ని నిలబెట్టుకుని మరోసారి తమ ఆధిపత్యాన్ని నిరూపించుకుంది. అంతకుముందు జరిగిన మహిళల ఫైనల్‌లో కూడా భారత జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచింది. ఇరాన్‌పై 37-34 తేడాతో గెలిచి స్వర్ణం కైవసం చేసుకుంది. దీంతో రెండు విభాగాల్లోనూ ఇరాన్‌ను ఓడించి భారత్ డబుల్ గోల్డ్ సాధించినట్టయింది.

VARTHAA SAKSHAMU వార్త సాక్ష్యం తెలుగు దిన పత్రిక Editor : SAGINALA RAVI KUMAR

# మా సినిమా టాక్ రివర్స్‌లో ఉంది: 'ప్యారడైజ్' విజయం పై నాని



నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో వచ్చిన 'ది ప్యారడైజ్' చిత్రంపై ప్రేక్షకులనుంచి వస్తున్న స్పందన చాలా కొత్తగా ఉందని నాని అన్నారు. శనివారం జరిగిన చిత్ర యూనిట్ ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ, సాధారణంగా ఉదయం పాజిటివ్ టాక్‌తో మొదలై సాయంత్రానికి మిశ్రమ స్పందన వచ్చే సినిమాలకు భిన్నంగా, తమ సినిమాకు షో షోకి ఆదరణ పెరుగుతోందని చెప్పారు. తమ చిత్రానికి అన్ని చిత్రాలకంటే రివర్స్‌గా మిక్స్ టాక్ వచ్చి, ఆ తర్వాత పాజిటివ్ టాక్ వచ్చిందని అన్నారు. "ఈ సినిమా విషయంలో నాకు ప్రతిదీ కొత్తగానే అనిపించింది. మేం ఈ సినిమాను రూపొందించిన విధానం, చిత్రీకరణ జరిపిన ప్రదేశాల్లోని పరిస్థితులు, ట్రైలర్ లేకుండానే సినిమాను విడుదల చేయడం, రిలీజ్‌కు ముందు నెలకొన్న ఉత్కంఠ... ఇలా అన్నీ మాకు కొత్త అనుభవాలే. ఒక సరికొత్త సినిమా చేస్తున్నామని, ప్రేక్షకులకు ఒక వినూత్నమైన అనుభూతిని అందిస్తున్నామని బలంగా నమ్మాం. అయితే, ప్రేక్షకుల నుంచి స్పందన కూడా ఇంత కొత్తగా, ఇంత అద్భుతంగా ఉంటుందని మేము ఊహించలేదు. ఇది నాకు వ్యక్తిగతంగా ఎప్పటికీ గుర్తుండిపోయే ఒక ప్రత్యేకమైన అనుభవం. నేను ఇండస్ట్రీకి వచ్చి ఎన్నో సినిమాలు చేశాను. ఈ మధ్యకాలంలో నేను గమనిస్తున్నదేమిటంటే, సినిమాలు విడుదలైన రోజు ఉదయం చాలా పాజిటివ్ స్పందనతో మొదలవుతాయి. కానీ, సాయంత్రానికి వచ్చేసరికి ఆ టాక్ కాస్త మిక్స్‌డ్‌గా మారిపోతుంది. మా 'ప్యారడైజ్' సినిమా విషయంలో దీనికి పూర్తి భిన్నంగా జరిగింది. విడుదల రోజున ప్రీమియర్ షోలతో ఒకరకమైన స్పందనతో మొదలై, ఆ తర్వాత ప్రదర్శించే ప్రతి షోతో పాజిటివిటీ పెరుగుతూ వచ్చింది. ప్రేక్షకుల నుంచి ఆదరణ అంతకంతకూ మెరుగవుతూ వచ్చింది. ఈ మధ్య కాలంలో ఒక సినిమాకు ఇలాంటి అద్భుతమైన స్పందన రావడం నేను చూడలేదు. మేమందరం చాలా నిబద్ధతతో, అంకితభావంతో ఈ సినిమా చేశాం. ప్రారంభంలో రకరకాల స్పందనలు వచ్చినప్పుడు వాటన్నిటినీ స్వీకరించాం. ఇప్పుడు ప్రేక్షకులు ఇంతగా ప్రేమను కురిపిస్తున్నప్పుడు, ఆ ఆదరణను, వారి ప్రేమను అంతే గౌరవంగా స్వీకరించాల్సిన సమయం వచ్చింది. ప్రతి ఒక్కరూ ఈ సినిమాను తమ సొంత సినిమాగా భావించి, అందులోని చిన్నచిన్న సందర్భాలను కూడా ఆస్వాదిస్తూ, వాటిని సెలబ్రేట్ చేసుకుంటుంటే మాకు చాలా సంతోషంగా అనిపించింది. తెలుగు ప్రేక్షకుల రుణం నేను ఎప్పటికీ తీర్చుకోలేను. వారు తమ అభిప్రాయాలను చాలా నిజాయితీగా, నిర్మొహమాటంగా చెబుతారు. అలాంటి గొప్ప ప్రేక్షకులు ఉన్నంతకాలం తెలుగు సినిమా ఉన్నత స్థాయిలో ఉంటుంది. మా చిత్ర బృందంలోని ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. 'ప్యారడైజ్' ఒక హీరో సినిమా కాదు. ఈ సినిమా కోసం కేవలం హీరోనే ఎక్కువగా కష్టపడ్డాడని ఎవరూ చెప్పలేరు. ఎందుకంటే, ఈ చిత్రంలో చిన్న పాత్రలు పోషించిన వారి నుంచి ప్రతి ఒక్కరూ ఎంత కష్టపడ్డారో నేను దగ్గరుండి చూశాను. వర్షంలో తడుస్తూ రోజుల తరబడి ఈ సినిమాను నమ్మి పనిచేశారు. మీరందరూ 'ప్యారడైజ్' చిత్రానికి నిజమైన హీరోలు. ప్రతి పాత్రధారి, ప్రతి కళాకారుడు, ప్రతి సాంకేతిక నిపుణుడు, ప్రతి అసిస్టెంట్ డైరెక్టర్... అందరూ నిద్రలేని రాత్రులు గడిపి పనిచేశారు. మీ కష్టానికి నా హ్యాట్సాఫ్. అనిరుధ్ అద్భుతమైన సంగీతం అందించాడు. అతను ఇచ్చిన సంగీతం వల్లే తెలుగు రాష్ట్రాల్లోని ప్రేక్షకులు థియేటర్లకు తరలివచ్చారు. సాయి ఈ సినిమాకి ఎంతో సమయం కేటాయించి కష్టపడ్డాడు. ఈ సినిమాను చిత్రీకరించడం అంత సులభం కాదు. అవినాష్ గారు ఎంతో శ్రమించి అద్భుతమైన సెట్స్ వేశారు. అలాగే ఎడిటర్ నవీన్ కూడా చాలా హార్డ్‌వర్క్ చేశాడు. సంపూ ఒక బ్యూటిఫుల్ హ్యూమన్ బీయింగ్, చాలా మంచివాడు. సవారి గ్యాంగ్‌లో నటించిన వాళ్లందరూ అద్భుతంగా చేశారు. మా స్టంట్, డాన్స్ కొరియోగ్రాఫర్లు కూడా అద్భుతంగా పనిచేశారు. ఈ సినిమాలోని భావోద్వేగాన్ని కాసర్ల శ్యామ్ గారు తన సాహిత్యంలో అద్భుతంగా పలికించారు. సుధాకర్ గారిని మేము చాలా ఇబ్బంది పెట్టాం. కానీ, ఆయన మా అందరినీ బలంగా నమ్మారు. షూటింగ్ సమయంలో ఎదురైన ఎన్నో సమస్యలకు ఆయన అండగా నిలబడ్డారు. ఆయన ఫిల్మోగ్రఫీలో 'ప్యారడైజ్' ఒక ప్రత్యేక చిత్రంగా నిలిచిపోతుంది. ప్రియదర్శి చేసిన శంకరన్న పాత్రకు అద్భుతమైన స్పందన వస్తోంది. ప్రియదర్శి ఒక టెర్రిఫిక్ పెర్ఫార్మర్. కయాదు లోహర్ పోషించిన 'సుబ్బు' లాంటి పాత్ర చేయడం చాలా కష్టం, కానీ తను అద్భుతంగా చేసింది. ఇక మా అందరి ఫేవరెట్ మోహన్ బాబు గారు. నాకు చిన్నప్పటి నుంచి ఆయన నటన అంటే ఎంతో ఇష్టం. 'అసెంబ్లీ రౌడీ', 'పెదరాయుడు' నా ఫేవరెట్ సినిమాలు. ఆయనతో కలిసి పనిచేసిన తర్వాతే ఆయన ఎంత గొప్ప వ్యక్తి అనేది నాకు అర్థమైంది. ఆయనతో దగ్గరగా పనిచేస్తే ఎవరైనా ఆయనతో ప్రేమలో పడిపోతారు. ఈ సినిమాకు హీరో పైన ఉన్న హీరో ఆయనే. దర్శకుడు శ్రీకాంత్ ఒక ఒరిజినల్ పీస్, అతని గురించి మాటల్లో చెప్పలేను. ఈ సినిమా విడుదల తర్వాత వచ్చిన స్పందన ఒక తుపానులా ఉంది. ఎక్కడికి వెళ్లినా, ఎవరిని కలిసినా ఒకటే టాపిక్... 'ప్యారడైజ్' విజయం. 2026లో అత్యధికంగా వినిపించిన సినిమా 'ప్యారడైజ్'. ఈ విజయాన్ని మాకు అందించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు" అంటూ నాని తన స్పీచ్ ముగించారు. ఈ కార్యక్రమంలో నటులు ప్రియదర్శి, సంపూర్ణేశ్ బాబు కూడా పాల్గొని తమ పాత్రలకు వస్తున్న స్పందన పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

## నాని పై బాలీవుడ్ నటుడి ఎమోషనల్ పోస్ట్.. మీరు నా సేఫ్ ప్లేస్!




- నాని పై భావోద్వేగ పోస్ట్ పెట్టిన బాలీవుడ్ నటుడు రాఘవ్ జుయల్
- నాని తనకు ఒక 'సేఫ్ ప్లేస్' లాంటి వారని వెల్లడి
- గందరగోళం లో ఉన్నప్పుడు నాని తనను చిన్నచూపు చూడలేదని వ్యాఖ్య
- కెరీర్‌కు, హృదయానికి నాని అండగా నిలిచారని ప్రశంస

నేచురల్ స్టార్ నాని కేవలం ప్రతిభావంతుడైన నటుడే కాకుండా, ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన మనిషి అని ఆయనతో కలిసి పనిచేసిన వారు తరుచూ చెబుతుంటారు. తాజాగా బాలీవుడ్ నటుడు, డ్యాన్సర్ రాఘవ్ జుయల్ ఈ జాబితాలో చేరారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో నాని కథానాయకుడిగా నటించిన 'ది ప్యారడైజ్' చిత్రంలో రాఘవ్ ఒక కీలకమైన ప్రతినాయకుడి పాత్రను పోషించారు. ఈ నేపథ్యంలో, నాని గురించి రాఘవ్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఒక సుదీర్ఘమైన, భావోద్వేగభరితమైన పోస్ట్‌ను పంచుకున్నారు. నాని తనకు ఒక 'సేఫ్ ప్లేస్' వంటి వారని ఆయన పేర్కొన్నారు. "జీవితంలో కొద్దిమంది మాత్రమే మనకు తెలియకుండానే మనకు ఒక భరోసానిచ్చే వ్యక్తిగా మారిపోతారు. నా పాలిట నాని గారు అలాంటి వ్యక్తి. చిత్ర పరిశ్రమలో కొన్నిసార్లు దిశానిర్దేశం లేక గందరగోళంలో ఉన్న సమయంలో, నాని గారు నాకు అండగా నిలిచారు. గంటల తరబడి నాతో గడుపుతూ సినిమా, కెరీర్, జీవితం గురించి చర్చించేవారు. నేను భావోద్వేగానికి లోనైనా లేదా అయోమయంలో ఉన్నా ఆయన నన్ను ఎన్నడూ చిన్నచూపు చూడలేదు. ఆయనతో మాట్లాడిన ప్రతిసారి నా మనసులోని భారం తగ్గేది" అని రాఘవ్ తన పోస్టులో వివరించారు. చాలామంది కేవలం సలహాలు మాత్రమే ఇస్తారని, కానీ నాని మాత్రం తనను అర్థం చేసుకుని సరైన దృక్పథాన్ని అందించారని రాఘవ్ ప్రశంసించారు. "ఎలాంటి సినిమాలు ఎంచుకోవాలో, వ్యక్తిగా ఎలా ఎదగాలి అనే విషయాలను ఆయనే నాకు నేర్పించారు. ఎవరూ గమనించనప్పుడు కూడా ఆయన ప్రదర్శించే నిజాయతీ, దయను నేను ఎంతగానో ఆరాధిస్తాను. కొందరు కెరీర్‌కు మార్గనిర్దేశం చేస్తే, మరికొందరు మనసిక స్థైర్యాన్ని ఇస్తారు. కానీ నాని గారు నాకు ఈ రెండూ అందించారు. ఐ లవ్ యూ నాని దాదా" అంటూ రాఘవ్ తన పోస్టును ముగించారు. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## ఫ్లాపులు తట్టుకోలేక పరేషాన్ అవుతున్న బ్యూటీలు!



వెండితెరపై కథానాయిక అందంగా ఉండాలి.. ఆకర్షణీయంగా అనిపించాలి. దిష్టి చుక్క పెట్టని చందమామలా కనిపించాలి. లేదంటే ఆడియన్స్ నిరాశపడిపోతారు .. నిరుత్సాహానికి లోనవుతారు. తెరపై సమాజసేవలో అలసిపోయిన నాయకుడికి .. ఆ నాయకుడికి విజిల్స్ కొట్టి విసిగిపోయిన ఆడియన్స్ కి కాస్త ఉపశమనాన్ని కలిగించేది హీరోయిన్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. అలాంటి హీరోయిన్ అందంగా ఉండాలని అనుకోవడంలోను తప్పులేదు. అభిమానుల మనసు దోచుకుంటూ .. అవకాశాలను అందుకుంటూ .. విజయాలను సొంతం చేసుకోవడం అంత తేలికైన విషయమేం కాదు. ఇక్కడ హిట్టు తప్ప వాళ్లను కాపాడే మరో మంత్రమే లేదు. ఒకప్పుడు హీరోయిన్స్ ఏళ్లతరబడి ఏలుతూ వెళ్లారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారిపోయింది. ఎంత గ్లామరస్ గా ఉన్నప్పటికీ .. ఎంత టాలెంట్ ఉన్నప్పటికీ రెండు మూడు ఫ్లాపులు పడితే అంతే సంగతులు. మేకప్ కిట్ సర్దుకుని మరో ఇండస్ట్రీకి వెళ్లడం తప్ప మరో మార్గం లేదు. కృతి శెట్టి ఇచ్చిన ఎంట్రీ మామూలుగా లేదు. ఫస్టు మూవీతోనే 100 కోట్ల బ్యూటీగా మార్కులు కొట్టేసింది. అరుదైన ఫీట్ గా చెప్పుకునే హ్యాట్రిక్ హిట్ ను దక్కించుకుని అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇక కుదురుకున్నట్టే అనుకునేంతలోనే పరాజయాల పలకరింపు మొదలైంది. అప్పటి నుంచి కృతి శెట్టి ఇక్కడ కనిపించలేదు. ఆ సమయంలో వరుస విజయాలతో చెలరిగిపోయిన శ్రీలీలకి కూడా ఆ తరువాత ఫ్లాపులు తప్పలేదు. ఆమె జోరు తగ్గడానికి కూడా ఎక్కువ సమయం పట్టలేదు. ఈ నేపథ్యంలోనే విశాలమైన కళ్లతో విన్యాసాలు చేసుకుంటూ భాగ్యశ్రీ బోర్సే తెరపైకి వచ్చింది. అమ్మాయి గ్లామర్ కి వంకబెట్టవలసిన అవసరం లేదని ఆడియన్స్ అనుకున్నారు. కుర్రాళ్లంతా కూడబలుక్కుని ఆమె అభిమానుల జాబితాలో చేరిపోయారు. కానీ సక్సెస్ అనేక విధాలుగా ఆమెతో దోబూచులాడుతూనే వచ్చింది. దాంతో ఆమె కూడా ఇతర భాషా చిత్రాల వైపు అడుగులు వేయవలసి వచ్చింది. ఎంత అందంగా ఉన్నా .. టాలెంట్ ఉన్నా కొంత కాలం కూడా నిలదొక్కుకోలేక పోతుండటం నిజంగా విచారించదగిన విషయమే.

PRINTED ,PUBLISHED ,OWNED BY VARTHAA SAKSHAMU NEWS .Regd no:APTEL/25/A5153, EDITOR :S.RAVI KUMAR, 32-3-1, SPG PALEM, ATMAKURU, KURNOOL ANDHRAPRADESH,-518422.